విద్యాధరే.. విశాలాక్షి



దేవీచౌక్‌లో అమ్మవారికి సరస్వతీదేవి అలంకరణ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజమహేంద్రవరం దేవీచౌక్ ప్రాంతం ఆధ్యాత్మిక పారవశ్యాన్ని కలిగిస్తోంది. అమ్మవారి జన్మ నక్షత్రం పురస్కరించుకొని బుధవారం సరస్వతీదేవి అవతారంలో అలంకరించారు. భక్తులతో సామూహిక సరస్వతీ పూజలు జరిపించారు. వేదికపై బాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారికి కుంకుమార్చన, హారతి నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

-న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం



సామూహిక పూజలు

నయనం.. నయా కష్టం

నేడు ప్రపంచ కంటిచూపు ప్రాముఖ్యత దినం



ఈనాడు, కాకినాడ

తరచూ తలనొప్పి వస్తోంది.. కళ్లు పొడిబారుతున్నాయి.. మంట.. ఎర్రగా మారి నేత్రాలు దురద పెడుతున్నాయి. చూపు మసకబారుతోంది.. ఎక్కువ మందిలో కనిపిస్తున్న ఇబ్బందులివి. వృద్ధాప్యంలో చూపు మందగించడం సహజం.. ఇప్పుడు చిన్నారుల్లో సైతం దృష్టిలోపాలు దర్శనమిస్తున్నాయి. కారణం స్మార్ట్ వ్యసనం.. మొబైల్, ట్యాబ్‌లు, కంప్యూటర్లు, టీవీలను గంటలకొద్దీ చూడడమే అంటున్నారు నిపుణులు.

ఆసుపత్రులకు వస్తున్న కేసుల్లో..

కళ్లు మసకబారడంతో వచ్చేవారు 60, పొడిబారడం 20, తలనొప్పి 10, కళ్లనుంచి నీరుకారడం వంటి సమస్యలతో వచ్చేవారు 5 శాతం ఉన్నారు.

- ఉమ్మడి జిల్లాలో కంటిశుక్లాలతో బాధపడేవారు 62 శాతం ఉండగా వక్రీభవన లోపాలతో 20, గ్లకోమా 6, జన్యుపరమైనవి 6.5, కంటిపొర 4.5, శస్త్రచికిత్సలు జరిగాక ఇబ్బందులు పడేవారు 1 శాతం ఉన్నారు.
- ప్రతి 20 నిమిషాలకోసారి కళ్లకు విశ్రాంతి ఇవ్వడం.. 20 అడుగుల దూరం ఉన్న వస్తువులను 20 సెకన్లపాటు చూడడం.. రెప్పలు ఆడించడం వంటివి చేయాలి. వీలైతే కంప్యూటర్, మొబైల్‌లో ఫాంట్స్ పెద్దవిగా చేసుకుని చూడడం, యాంటీగ్లేర్ వంటి రక్షణ ఇచ్చే కళ్లద్దాలు వాడడం వంటి ప్రక్రియలతో కంటిపై ఒత్తిడి తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు.



పాఠశాల విద్యార్థులకు నేత్ర పరీక్షలు (పాత చిత్రం)

వీటితో మేలు

- క్యారెట్, క్యాప్సికం, పాలకూర, చిలగడదుంప, నారింజ, బొప్పాయి, కర్బూజా, చేపలు, పీతలు, మాంసం, గుమ్మడి గింజలు, అవిసె గింజలు, వేయించిన సోయాబీన్స్ కంటికి మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

పాఠశాలల్లో నేత్ర పరీక్షల తీరిదీ.. (ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు..)

విషయం	కాకినాడ	తూర్పు గోదావరి	అంబేడ్కర్ కోనసీమ
శిబిరాలు జరిగిన పాఠశాలలు	215	74	131
కంటి పరీక్షలు	24,199	10,383	19,461
కళ్లద్దాలు అవసరమైనవారు	1,150	327	772
ఇతర నేత్ర సమస్యలతో..	29	23	6

జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం కింద.. (అక్టోబర్ 2023 నుంచి ఏప్రిల్ 2024 వరకు)

విషయం	కాకినాడ	తూర్పు గోదావరి	అంబేడ్కర్ కోనసీమ
నేత్ర శస్త్రచికిత్సలు	1,960	1,624	1,124
కళ్లజోళ్ల లబ్ధిదారులు	26,420	28,429	32,359

కాపాడుకుందాం..

ప్రాథమిక స్థాయి నుంచి డిగ్రీ వరకు కాకినాడ జిల్లాలో 3.48 లక్షల మంది విద్యార్థులుంటే.. తూర్పుగోదావరిలో 3.14 లక్షల మంది, కోనసీమలో 2.41 లక్షల మంది ఉన్నారు. స్క్రీన్‌టైం పెరగడం వీరిలో సమస్యకు ప్రధాన కారణమవుతోంది. 'సి' విటమిన్ లోపించడం, హార్మోన్ల అసమతుల్యత, థైరాయిడ్, మధుమేహానికి తోడు కంప్యూటర్, మొబైల్, టీవీ ముందు ఎక్కువసేపు గడపడం ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి.

కంటిపై ఒత్తిడి తగదు..

కంటిపై ఒత్తిడి పెరిగితే అనర్థాలే.. 40 ఏళ్ల వయసు దాటితే దృష్టిలోపం రావడం సహజం. కానీ ఇప్పుడు చిన్నపిల్లలు, యువతలోనూ సమస్యలు ఎక్కువవుతున్నాయి. స్క్రీన్ టైం పెరగడంతో వచ్చే ఇబ్బంది ఇది. పాఠశాలల్లో నేత్ర సర్వే ద్వారా సమస్యలు గుర్తించాం. ప్రత్యేక శిబిరాల్లో పెద్దల్లోనూ కంటి ఇబ్బందులు గుర్తించి శస్త్రచికిత్సలు, కళ్లద్దాలు అందిస్తున్నాం. 60 ఏళ్లు దాటిన వారిలో శుక్లాల సమస్య ఉంటే ముదిరిపోకుండా శస్త్రచికిత్స చేసుకోవడం మేలు.



- డాక్టర్ పి.వి.ప్రసాద్, ప్రోగ్రాం మేనేజర్, అంధత్వ నివారణ సంస్థ, కాకినాడ జిల్లా

జేసీ ఛాంబర్‌లో ఇసుక గుత్తేదారుల గలాటా

ఈనాడు, రాజమహేంద్రవరం: జిల్లాలోని 17 ఓపెన్ రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు సంబంధించి టెండర్ల దాఖలుకు చివరి రోజైన బుధవారం గందరగోళం నెలకొంది. నిర్ణీత సమయం కన్నా ముందే వచ్చినా టెండర్ వేయకుండా కొందరు అడ్డుకున్నారని కాటవరానికి చెందిన ఫణి అనే వ్యక్తి ఆరోపించారు. సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉందని, తాము ఆ లోగా చేరుకోవడంతో సిబ్బంది లోపలికి అనుమతించారన్నారు. అక్కడే ఉన్న ఇతర ప్రాంతాల ఇసుక వ్యాపారులు తమను నిలువరించి, టెండర్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారన్నారు. అక్కడి సిబ్బంది సైతం వారిని అడ్డుకోలేదని.. చేసేదిలేక వెనుదిరిగామన్నారు. ఈ విషయమై జేసీ చిన్నరాముడి వద్ద ప్రస్తావించగా గొడవ జరిగిన విషయం తమ దృష్టికి రాలేదన్నారు. ఛాంబర్‌లో 17 రీచ్‌లకు సంబంధించి వరుసగా పెట్టెలు ఏర్పాటు చేశామని, నిర్ణీత సమయంలోగా వస్తే అందులో వేసి వెళ్లిపోవచ్చన్నారు. ఘటన గురించి వివరాలు తెలుసుకుంటానన్నారు.

413 మద్యం దుకాణాలు.. 7,350 దరఖాస్తులు

ఈనాడు, కాకినాడ

ఉమ్మడి జిల్లాలో 413 మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీకి నోటిఫికేషన్ ఇవ్వగా బుధవారం రాత్రి 8 గంటల సమయానికి 7,350 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం ఈనెల 11 వరకు గడువు పొడిగించింది. 14న లాటరీ తీసి లైసెన్సులు ఖరారుచేస్తారు. 16 నుంచి దుకాణాలు ప్రారంభించుకునే వెసులుబాటు కల్పిస్తారు. దరఖాస్తుకు రూ.2లక్షల చొప్పున ప్రభుత్వానికి రూ.200 కోట్లు వచ్చే అవకాశం ఉంది.

పరిశీలిస్తే: దుకాణాలు తక్కువగా ఉన్న తూర్పుగోదావరిలో అత్యధిక దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాతి స్థానంలో కోనసీమ ఉంది. అత్యధికంగా మంజూరైన కాకినాడ జిల్లాలో దరఖాస్తులు తక్కువగా రావడం చూస్తే రాజకీయ జోక్యం, గతంలో ఈ వ్యాపారంమీద పట్టు ఉన్నవారు దక్కించుకోడానికి సిండికేట్ వ్యవహారం నడుస్తున్నట్లు తెలుస్తోంది.

జిల్లా	మద్యం దుకాణాలు	వచ్చిన దరఖాస్తులు (9వ తేదీ నాటికి)
కాకినాడ	155	1,716
తూర్పుగోదావరి	125	2,896
అంబేడ్కర్ కోనసీమ	133	2,738

- తూర్పుగోదావరిలో అత్యల్పంగా 30వ దుకాణానికి మూడు, 29కి నాలుగు చొప్పున వచ్చాయి. 37, 100 నంబర్ల దుకాణాలకు ఏడు చొప్పున... 1, 32, 35 దుకాణాలకు ఎనిమిది చొప్పున వచ్చాయి. 2, 3, 4, 5, 13, 18, 26, 101, 104, 105 దుకాణాలకు తొమ్మిది చొప్పున దరఖాస్తులు అందాయి. ఇక్కడా సిండికేట్ ప్రభావం ఉన్నట్లు తెలుస్తోంది. అత్యధికంగా 46వ నంబర్ దుకాణానికి 54 వచ్చాయి.. 55వ దుకాణానికి 46 రాగా 47, 72, 83, 87 దుకాణాలకు 44 చొప్పున అందాయి.



కాకినాడలోని అబ్కారీశాఖ కార్యాలయం

- కాకినాడ జిల్లాలో పరిశీలిస్తే 132వ దుకాణానికి 26 దరఖాస్తులు వస్తే.. 37, 45, 112, 130 దుకాణాలకు 25 చొప్పున వచ్చాయి. 121వ నంబరుకు కేవలం రెండు అందగా.. 89, 117, 120 నంబర్లకు మూడు చొప్పున వచ్చాయి.

అన్నదాతల ఇంట ఆనందమే కూటమి లక్ష్యం

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి.. అన్నదాతల ఇంట ఆనందం వెల్లివిరిసేలా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. కొవ్వూరు మండలం కాపవరంలో ఏర్పాటు చేసిన ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. వ్యాపార, పారిశ్రామికవేత్తలకు అందించే సౌలభ్యాలు రైతుకు కూడా అందించాలని భావిస్తున్నామన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ వైకాపా అయిదేళ్ల పాలనలో రైతు నడ్డివిరిచారని, రైసు మిల్లర్లు సైతం నష్టాలపాలయ్యారని విమర్శించారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో రైతే రాజు అని చెప్పి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో అధికార పార్టీకి కొమ్ముకాసిన రైసు మిల్లర్లే బాగుపడ్డారన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ మెట్ట ప్రాంతాలకు సైతం సాగునీరు అందించిన ఘనత ఎన్డీయే కూటమికే చెందుతుందన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పెదపూడి మండల రైతులు పండించిన ధాన్యం బిక్కవోలు మండలంలో రైసు మిల్లర్లకు కేటాయించేలా చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జనసేన నియోజక వర్గ ఇన్‌ఛార్జి టి.వి.రామారావు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, నాయకులు సూరపనేని చిన్ని, కాకర్ల నారాయుడు, సుంకర సత్తిబాబు, డేగల రాము, ఏరుబండి సురేష్, పౌరసరఫరాల శాఖ ఎండీ జిలాని నమూన్, కమిషనర్ జి.వీర పాండ్యన్, జిల్లా మేనేజర్ టి.రాధిక, జేసీ ఎస్.చిన్నరాముడు, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్‌వో ప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖాధికారి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



చిరుధాన్యాల పంట విస్తరణ వివరాలు తెలుసుకుంటున్న మంత్రులు మనోహర్, దుర్గేష్, ఎమ్మెల్యేలు, కలెక్టర్ తదితరులు

ఉచిత న్యాయ సహాయానికి టోల్ ఫ్రీ నంబరు 15100

దానవాయిపేట(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయం పొందాలనుకునేవారు 15100 టోల్ ఫ్రీ నంబరులో సంప్రదించవచ్చని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నంబరుపై ప్రజలకు అవగాహన కార్యక్రమంలో భాగంగా 15100 గోడపత్రికను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, బస్, రైల్వే స్టేషన్లు, ఆటో స్టాండ్లు, ప్రభుత్వ ఆసుపత్రి, కేంద్ర కారాగారం, న్యాయస్థానాల ఆవరణ, పాఠశాలు, కళాశాలలు వంటి ప్రదేశాల్లో ఈ గోడపత్రికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

పుట్టినరోజు వేడుకలో కొకైన్.. గంజాయి

- భూపాలపట్నంలో కలకలం
- పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు

రాజానగరం: రాజానగరం మండలం భూపాలపట్నంలో మాదకద్రవ్యాలు తీసుకుంటూ పుట్టినరోజు వేడుక చేసుకోవడం కలకలం రేపింది. ఈ క్రమంలో ముగ్గురు పోలీసులకు పట్టుబడినట్లు తెలుస్తోంది. భూపాలపట్నం నుంచి జి.యర్రంపాలెం వెళ్లే రహదారిలో పొలాల మధ్య ఉన్న ఓ అతిథిగృహంలో మత్తు, మాదకద్రవ్యాలతో 20 మందికి పైగా ఉల్లాసంగా గడుపుతున్నట్లు పోలీసులకు సమాచారం రాగా వారు దాడి చేశారు. దివాన్ చెరువులో నివాసం ఉంటున్న తాడేపల్లిగూడేనికి చెందిన ఓ వ్యక్తి.. స్వస్థలానికి చెందిన తన మిత్రులతో కలిసి ఈ అతిథిగృహంలో పుట్టినరోజు వేడుక నిర్వహించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ క్రమంలోనే సదరు అతిథిగృహంలో మద్యం తీసుకోవడంతో పాటు.. విందు చేసుకున్నట్లు తెలుస్తుండగా, కొందరు యువతులు కూడా ఉన్నట్లు సమాచారం. పోలీసులు దాడి చేయడంతో పలువురు పారిపోగా.. ముగ్గురు యువకులు పట్టుబడ్డారు. అతిథిగృహం వద్ద ఉన్న కారులో రెండు కొకైన్ ప్యాకెట్లు, కొన్ని గంజాయి ప్యాకెట్లు దొరికినట్లు తెలుస్తోంది. వీటిని ఎవరు సరఫరా చేశారు? ఎక్కడి నుంచి తీసుకువచ్చారు? వెనుక ఎవరున్నారు? అనే విషయమై పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. పోలీసులు మాత్రం ఇంకా వివరాలు వెల్లడించలేదు. దాడి జరిగిన మాట వాస్తవమేనని, దర్యాప్తు చేస్తున్నామని మాత్రం స్పష్టం చేస్తున్నారు.


నిడదవోలు: కోటసత్తెమ్మ


తాళ్లపూడి నవదుర్గాదేవి


ద్రాక్షారామ మాణిక్యాంబ..

విద్యా ప్రదాయిని నమోస్తుతే..!

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమాతను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు మండపాల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, బృందం

ప్రజా భాగస్వామ్యంతో జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికల రూపకల్పనలో క్షేత్రస్థాయిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, వివిధ రంగాలకు సంబంధించి దేశస్థాయిలో వికసిత్ భారత్, రాష్ట్రస్థాయిలో స్వర్ణాంధ్ర-2024 విజన్ ప్రణాళికలు రూపొందించడంలో పాలుపంచుకోవాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర-2047 జిల్లా విజన్ ప్రణాళికలపై బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వచ్చేనెల ఒకటిన విజన్ ప్రణాళికలు రూపకల్పన దిశగా రాష్ట్ర స్థాయిలో పరిగణనలోకి తీసుకున్న అంశాలను జిల్లాస్థాయిలో సమీక్షించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. వివిధ రంగాలకు సంబంధించి సమస్యలపై చర్చించి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో ప్రభుత్వం ఈ నెల 14 నుంచి 20 వరకు పల్లెపండగ వారోత్సవాలు నిర్వహిస్తోందని, దీనిలో భాగంగా ఆయా గ్రామాల్లో గుర్తించిన పనులు ప్రాధాన్య క్రమంలో చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విభాగాలకు సంబంధించిన వివిధ శాఖల అధికారులు భవిష్యత్తులో చేపట్టే అంశాలు, ప్రగతిపై నివేదికలు ఇవ్వాలన్నారు. రాజమహేంద్రవరం గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ముఖ్యంగా విద్య, వైద్యంతోపాటు అందరికీ ఉపాధి కల్పన దిశగా ప్రణాళికలు అవసరమన్నారు. నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, వివిధరంగాలకు చెందిన పలువురు మాట్లాడుతూ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై సలహాలు సూచనలు అందించారు.


మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు

ఉన్నత విద్యకు 'ప్రతిభ' ఉపకార వేతనాలు

నవంబరు 11 వరకు దరఖాస్తుల స్వీకరణ


ఏలేశ్వరం: ప్రతిభకు పేదరికం అడ్డుకాకూడదన్న లక్ష్యంతో ప్రవాస భారతీయుడు పల్లిపల్లి రమేష్ 2012లో 'ప్రతిభ' స్కాలర్‌షిప్ ట్రస్ట్ స్థాపించారని కార్యదర్శి ఎండీ ఇబ్రహీం ఖాన్ బుధవారం తెలిపారు. ఐఐటీ, నీట్, జేఈఈ, ఇంజినీరింగ్, మెడిసిన్ 2024-25లో ప్రవేశం పొందగోరే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని ప్రతిభావంతులను ఎంపిక చేసి ఉపకార వేతనం అందిస్తామన్నారు. ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించి, పేద కుటుంబంలోని వారికి ప్రాధాన్యమిస్తామని, ఎంపికైన వారికి కోర్సు పూర్తయ్యేవరకు స్కాలర్‌షిప్ అందజేస్తామన్నారు. దరఖాస్తులను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ప్రతిభస్కాలర్‌షిప్.కామ్ వెబ్‌సైట్ నుంచి తీసుకుని నవంబరు 11లోపు పంపాలన్నారు. దరఖాస్తులను వరుపుల చిట్టిబాబు, శ్రీ గణపతి వెంకట సత్యసాయి బ్యాంకర్స్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏలేశ్వరం, 533429 చిరునామాకు పంపాలన్నారు. వివరాలకు 9951367872, 9948417174 నంబర్లను సంప్రదించాలి.

ఒత్తిడిని జయిద్దాం.. సమస్యను తరిమేద్దాం

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

☛ గంజాయికి బానిసలైన తుని పట్టణానికి చెందిన కొందరు యువకులు అది దొరకని పరిస్థితుల్లో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై గొడవలు, దాడులకు దిగారు. కొంత కాలం క్రితం ఎస్‌ఆర్‌రోడ్డులోని ఓ కొబ్బరిబొండాలు అమ్మే వ్యక్తిని, అతని కుమారుని చితకబాదారు. వీరిని పట్టుకుని పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

☛ కాకినాడకు చెందిన 16 ఏళ్ల బాలిక 10వ తరగతి తప్పడంతో చదువు మానేసి ఇంటి వద్దే ఉంటుంది. కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతూ మందులు వాడుతోంది. తనలో తాను మాట్లాడుకోవడం, చచ్చిపోవాలని ఉందంటూ కుటుంబ సభ్యులతో చెప్పేది. ఈ క్రమంలో ఇటీవల చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెందింది.



కాకినాడ జీజీహెచ్‌లోని మానసిక వైద్య విభాగంలో ఓపీ, ఐపీ కేసుల వివరాలివి (ఇప్పటి వరకు)

ఏడాది	■ ఓపీ	▲ ఐపీ
2019	14119	306
2020	11485	166
2021	12845	129
2022	31353	430
2023	32326	701
2024	24155	475

మసీదు సెంటర్ (కాకినాడ), తుని, న్యూస్‌టుడే: ఆధునిక పోటీ ప్రపంచంలో మనిషి నిత్యం కాలంతో పరుగుపెట్టాల్సిన ఆవశ్యకత పెరగడంతో తీవ్ర ఒత్తిడికి గురికావాల్సి వస్తోంది. ప్రస్తుత కాలంలో ఆర్థిక, సామాజిక, శారీరక ఇలా వివిధ కారణాలతో ఒత్తిడికి గురై మానసిక అనారోగ్యంతో అనేకమంది బాధపడుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఒత్తిడి వివిధ రూపాల్లో చిన్నా పెద్దా అందరినీ కుంగదీస్తున్న ప్రధాన సమస్య.

ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండేందుకు ఇలా చేద్దాం

- సూర్యోదయానికి ముందే లేచి వ్యాయామం, యోగా చేయాలి
- అల్పాహారంలో నూనె, మసాలాలు వాడిన పదార్థాలు తగ్గించాలి.
- పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలున్న ఆహారం తీసుకోవాలి.
- రోజూ విధి నిర్వహణే కాకుండా ఆధ్యాత్మిక చింతన, మొక్కలు, పక్షులు, జంతువుల పెంపకంపై దృష్టి పెట్టాలి.
- బంధుమిత్రులతో సమయం గడపాలి.
- క్రీడలు, చిత్రలేఖనం, కథలు, వ్యాసాలు రాయడం వంటి వాటిని అలవాటు చేసుకోవాలి.
- పిల్లలు సెల్‌ఫోన్లు వినియోగించకుండా ఉండేందుకు వారికి చదువు, ఆటపాటలతో పాటు ఇంటి పనులు కూడా అలవాటు చేయాలి.
- విహార యాత్రలకు వెళ్లడం, సినిమాలు చూడటం, పుస్తకాలు చదవడం మానసికోల్లాసానికి దోహదపడతాయి.

మనోవ్యాధికి మందు లేదనేది అపోహ..



మనోవ్యాధికి మందు లేదనేది అపోహ మాత్రమే. చాలావరకు మానసిక సమస్యలు మెదడులోని రసాయనిక మార్పుల వల్ల వచ్చేవే కాబట్టి మందులతో చాలా వరకు నయం అవుతాయి. కౌన్సెలింగ్ ద్వారా మరికొన్ని సమస్యలకి పరిష్కారం దొరుకుతుంది.

- డా.వరప్రసాద్, జీజీహెచ్ మానసిక వైద్యనిపుణులు

ఆహ్లాదకర వాతావరణంలో పని..



ఆరోగ్యపరమైన, భద్రత కలిగిన వాతావరణం పని ప్రదేశాల్లో కల్పించినప్పుడే ఎక్కువ ఉత్పాదకత సాధించి దేశం ఆర్థికాభివృద్ధి చెందుతుంది. ఒత్తిడి రహితమైన పని పరిస్థితిని కల్పించే బాధ్యత ప్రభుత్వం, యాజమాన్య సంస్థలు తీసుకోవాలి. పని వల్ల కలిగే తీవ్ర ఒత్తిడి వల్లే మానసిక ఆరోగ్యం దెబ్బతింటోంది.

- డా. గోదవర్తి సత్యమూర్తి, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, కాకినాడ

ముగిసిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీలు

దివాన్‌చెరువు (రాజానగరం): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పరిధిలోని దివాన్‌చెరువు శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో గత మూడు రోజులుగా నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల హ్యాండ్ బాల్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు ప్రథమ స్థానం, శ్రీకాకుళం జిల్లా జట్టు ద్వితీయ స్థానం, తూర్పు గోదావరి జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించాయి. ముఖ్య అతిథులుగా హాజరైన నారాయణ, విజయప్రకాష్ విజేతలకు బహుమతులు అందజేశారు. విజేతల జట్ల నుంచి ఉత్తమ నైపుణ్యం, ప్రతిభ కనబరచిన క్రీడాకారులను గుర్తించి జాతీయ జట్టుకు ఎంపిక చేశారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచిన రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని రాజమహేంద్రవరం డీవైఈఓ నారాయణ, శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ అన్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థ మేనేజర్ ఏఎస్ఎన్ మూర్తి, క్రీడల పరిశీలకుడు ఎన్.వి.నాగేంద్ర, ఎస్.నాగరాజు, వీరబాబు, ఎస్.గంగాధర్, విమల తదితరులు పాల్గొన్నారు. ★ పోటీల్లో ప్రతిభ కనబరచిన 16 మంది క్రీడాకారులతో జాతీయ స్థాయిలో ఆడే జట్టును ఎంపిక చేశారు. ఇందులో చిత్తూరు జిల్లా నుంచి ముగ్గురు, శ్రీకాకుళం జట్టు నుంచి ఇద్దరు, తూర్పుగోదావరి జట్టు నుంచి ఇద్దరు, విశాఖపట్నం జట్టు నుంచి ఒకరు, ప్రకాశం, విజయనగరం, కర్నూల్, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జట్టు నుంచి ఒక్కొక్కరు వంతున ఎంపికయ్యారు. కె.తేజసాయిరెడ్డి, జి.తంగరాజు, ఎమ్.యోగేశ్వర్, ఆర్.వేదాంతసాయి, జీహెచ్.దిల్లేశ్వరరావు, కె. సెల్విక్, ఎ.వెంకట్‌గణేష్, ఎ.దేవ్ సూర్యసాయి, పి.దేవి చరిత సత్య, పి.జస్వంత్, ఎమ్.ప్రసాద్ నాయక్, డి.జాషువ, వి.గౌరీశంకర్, ఎమ్.తన్విత్, ఎ.రాజ్‌పాల్, కె.చైతన్య కుమార్ జాతీయ జట్టులో స్థానం సంపాదించారు.

టెట్‌కు 438 మంది హాజరు

శ్యామలాసెంటర్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష బుధవారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. రాజమహేంద్రవరంలోని లూథర్‌గిరి ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఉదయం జరిగిన పరీక్షకు 240కి 218 మంది, మధ్యాహ్నం 240కి 220 మంది హాజరైనట్లు డీఎస్ఈఓ కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఐఐటీ సర్టిఫికెట్ కోర్సుల్లో డాక్టర్ రామారెడ్డి ఉత్తీర్ణత



రాజమహేంద్రవరం సాంస్కృతికం: చదువును వ్యాపకంగా మార్చుకుని ఆసక్తి కలిగిన అంశాల్లో డిగ్రీలు, మాస్టర్ డిగ్రీలు పూర్తి చేసిన డాక్టర్ రామారెడ్డి ఈసారి ఐఐటీల్లో ఒకేసారి 12 సర్టిఫికెట్ కోర్సుల్లో నమోదు చేసుకున్నారు. ఇటీవల జరిగిన నాలుగు సెమిస్టర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి గతంలో ఉన్న 38 డిగ్రీలకు అదనంగా మరో నాలుగు డిగ్రీలు చేరడంతో డిగ్రీలు, డిప్లొమోల జాబితా 42కు చేరింది. ఐఐటీ రూర్కీ నుంచి సోషియాలజీ ఆఫ్ సైన్స్ కోర్సులో 86 శాతం మార్కులతో కోర్సు టాపర్‌గా నిలిచినట్లు రామారెడ్డి తెలిపారు. ఐఐటీ మద్రాస్ నుంచి కర్ణాటక సంగీతం కోర్సు, ఐఐటీ రూర్కే నుంచి పర్‌స్పెక్టివ్స్ ఆన్ న్యూరోలింగ్విస్టిక్స్ కోర్సు, ఐఐటీ కాన్పూర్ నుంచి ఇంట్రడక్షన్ టు ఇండియన్ ఆర్ట్ కోర్సులో అధిక శాతం మార్కులతో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెదేపా తరఫున పోటీ చేసే అభ్యర్థిని గెలిపించుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కూటమి నాయకులు నిర్ణయించారు. కాకినాడ రామారావుపేటలోని జిల్లా తెదేపా కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. కాకినాడ జిల్లా తెదేపా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అధ్యక్షత వహించగా, పరిశీలకునిగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని తెదేపా అధినేత చంద్రబాబు నిర్ణయిస్తారన్నారు. తనను గెలిపించుకునేందుకు ఓట్ల నమోదుపై దృష్టి పెట్టాలన్నారు. మూడు పార్టీల నాయకులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. గత గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థిని నిలపలేదన్నారు. యువత, కూటమి సానుభూతి పరులను ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. త్వరలో ఉమ్మడి జిల్లాల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, జ్యోతుల నెహ్రూ, వనమాడి కొండబాబు, దాట్ల బుచ్చిబాబు, వేగుళ్ల జోగేశ్వరరావు, అయితాబత్తుల ఆనందరావు, వరుపుల సత్యప్రభ, పంతం నానాజీ, మిరియాల శిరీష, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యేలు పిల్లి అనంతలక్ష్మి, పెందుర్తి వెంకటేష్, జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, జిల్లా భాజపా అధ్యక్షుడు రామ్‌కుమార్, జిల్లా జనసేన అధ్యక్షుడు తుమ్మల బాబు, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ మోకా ఆనందసాగర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో యనమల, చినరాజప్ప, తదితరులు

రోడ్డు ప్రమాదంలో పారా లీగల్ వాలంటీర్ మృతి

రాజమహేంద్రవరం నేరవార్తలు: జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని పారా లీగల్ వాలంటీర్ మృతి చెందిన ఘటన రాజమహేంద్రవరం గ్రామీణం బొమ్మూరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కాశీ విశ్వనాథం వివరాల మేరకు.. రాజమహేంద్రవరంలోని తాడితోట అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పెనుగుల బేబీ ప్రశాంతి(40) పదేళ్లుగా పారా లీగల్ వాలంటీర్‌గా పని చేస్తున్నారు. ఆమె బుధవారం సాయంత్రం రాజానగరంలోని జీఎస్ఎల్ ఆసుపత్రిలో ఓ పని నిమిత్తం వెళ్లి రాత్రికి అక్కడ పని చేస్తున్న మరో మహిళతో కలిసి ద్విచక్ర వాహనంపై నగరానికి బయలుదేరారు. మార్గ మధ్యలో ఆటోనగర్ ఫ్రెండ్స్ దాబా వద్దకు చేరుకునే సరికి వేగంగా వెనక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ప్రశాంతి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఆ ఘటనలో ఇద్దరు రోడ్డుపై పడిపోగా ప్రశాంతికి తల వెనుకగా యమై ఘటన స్థలంలోనే మృతి చెందారు. మరో మహిళ గాయపడగా ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆమె చికిత్స పొందుతుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రెట్టింపు నగదు ఆశ చూపి.. ఆన్‌లైన్‌లో రూ.3 లక్షలు చోరీ

రాజమహేంద్రవరం నేరవార్తలు: యాప్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు నగదు వస్తుందని ఆశపడిన ఓ మహిళ వద్ద ఆన్‌లైన్‌లో రూ.3 లక్షలు దోచుకున్న ఘటన బొమ్మూరు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ విశ్వనాథం వివరాల మేరకు.. పిడుంగొయ్యి శాంతిపురం ప్రాంతానికి చెందిన ఆర్.నాగబాబు, వెంకటలక్ష్మి దంపతులు. వెంకటలక్ష్మి ఆన్‌లైనులో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నారు. ఆ తరుణంలో ఓ యాప్‌లో ఉద్యోగానికి దరఖాస్తు చేయగా గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తాము సూచించిన యాప్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు నగదు వస్తుందని ఆశచూపాడు. అతడి మాయమాటలు నమ్మిన లక్ష్మి పలు దఫాలుగా రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టారు. రోజులు గడుస్తున్న రెట్టింపు నగదు ఇవ్వకపోగా యాప్ నిర్వాహకుల నుంచి ఎటువంటి సమాచారం రావడం లేదు. దీంతో మోసపోయామని గ్రహించిన దంపతులు పోలీసులను ఆశ్రయించారు.

శవయాత్రలో యువకుల వీరంగం

ఆర్టీసీ బస్సు కిటికీ అద్దాలు ధ్వంసం ■ ఇద్దరిపై కేసు నమోదు

రాజమహేంద్రవరం నేరవార్తలు: శవయాత్రలో కొందరు మద్యం మత్తులో చెలరేగిపోయి ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం చేసి, డ్రైవరుపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన రాజమహేంద్రవరం రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ దుర్గారావు, స్థానికుల వివరాల మేరకు.. బుధవారం ఉదయం మోరంపూడి ప్రాంతానికి చెందిన ఓ యువకుడి మృతదేహాన్ని నగరంలోని అల్కాట్‌గార్డెన్స్ వద్ద ఉన్న రోటరీ కైలాస భూమికి తరలించే అంతిమ యాత్రలో భారీగా యువకులు పాల్గొన్నారు. యాత్ర అల్కాట్‌గార్డెన్స్ గూడ్సుగేటు వద్ద నుంచి గోదావరి గట్టుపైకి వెళుతున్న సమయంలో వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సుకు కొంతమంది అడ్డుపడి కొంత సమయం నిలిపివేయాలని డ్రైవరుకు చెప్పగా, ఆయన తప్పుకోవాలంటూ హారన్ కొట్టడంతో మద్యం మత్తులో ఉన్న అయిదుగురు యువకులు బస్సు రెండు కిటికీల అద్దాలు పగలగొట్టారు. డ్రైవరుపై చేతులతో దాడిచేసి అతడి వైపు ఉన్న తలుపు విరగొట్టారు. ఆ క్రమంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని నియంత్రించేందుకు ప్రయత్నించగా వారిపట్ల దురుసుగా ప్రవర్తించారు. దీనికి సంబంధించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని, ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


ధ్వంసమైన బస్సు అద్దాలు, డ్రైవరు డోరు

ఏళ్లు గడుస్తున్నాయి.. ఇళ్ల నిర్మాణం కాలేదు

పోలవరం నిర్వాసితుల ఆందోళన

గోకవరం, దేవీపట్నం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు కోసం ఊరు, నమ్ముకున్న నేలను త్యాగం చేశాం. వాటిని వదులుకొని వస్తే గత వైకాపా ప్రభుత్వ హయాంలో కనీసం పట్టించుకోలేదని పోలవరం ముంపు గ్రామాల నిర్వాసితులు కన్నీటి పర్యంతమయ్యారు. గోకవరం మండలం కృష్ణునిపాలెం ఆర్అండ్ఆర్ కాలనీ నుంచి గోకవరం శివారు గంగాలమ్మ ఆలయ సమీపంలోని దేవీపట్నం పునరావాస కాలనీ వరకు బుధవారం నిర్వాసితులు భారీ నిరసన ర్యాలీ చేశారు. ప్రధాన రహదారి మీదుగా నినాదాలు చేస్తూ ప్లకార్డులతో శాంతియుతంగా ర్యాలీ సాగింది. దేవీపట్నం, పూడిపల్లి, వీరవరం, రమణయ్యపేట, మంటూరు, అగ్రహారం, మూలపాడు, పెనికెలపాడు, కొండమొదలు తదితర ఆరు పంచాయతీలకు చెందిన నిర్వాసితులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. వరద మా గ్రామాలను ముంచెత్తడంతో అప్పటి వైకాపా ప్రభుత్వం మెరుగైన ప్యాకేజీ అందించడంతో పాటు పునరావాస కాలనీని పూర్తి చేస్తామని నమ్మబలికి బలవంతంగా ఖాళీ చేయించి రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గోకవరం వచ్చి మూడేళ్లు దాటుతున్నా ఇప్పటికి కనీసం కాలనీలో ఇళ్ల నిర్మాణాలూ పూర్తికాలేదన్నారు. ఉపాధి లేక అద్దె ఇళ్లలో జీవనం సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మండలంలోని 44 గ్రామాలు ముంపునకు గురయ్యాయని అన్ని ఆధారాలను చూపిస్తూ అర్హులుగా గుర్తించాలని గత వైకాపా ప్రభుత్వంలో రంపచోడవరం, ధవళేశ్వరంలో మూడేళ్లుగా తిరుగుతున్నామన్నారు. రంపచోడవరం వెళితే ధవళేశ్వరం వెళ్లమని, ధవళేశ్వరం వెళితే రంపచోడవరం వెళ్లమని తిప్పుతున్నారన్నారు. అర్హుల దరఖాస్తులను పరిశీలించి న్యాయం చేయాలని వేడుకున్నారు. పోలవరం నిర్వాసితుల ర్యాలీకి ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు, సర్పంచి వేట్ల విజయమని, వంజం జోగారావు, వేట్ల సత్యనారాయణ, శ్రీరాములు సంఘీభావం తెలిపారు.


నిరసనలో పోలవరం నిర్వాసితులు

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

ఉద్యోగాలకు 27 మంది ఎంపిక

వి.ఎల్.పురం : నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన సంస్థలు, న్యాక్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ఉన్న న్యాక్‌లో నిర్వహించిన ఈ మేళాకు 81 మంది అభ్యర్థులు హాజరుకాగా వీరిలో 27 మంది నాలుగు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్య, ఉపాధి అధికారులు గంటా సుధాకర్, హరిశ్చంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో న్యాక్ ఏడీ జి.రాజు, ఏడీఎస్‌డీవో పెరుమాళ్, నైపుణ్య కళాశాల కోఆర్డినేటర్ శ్రీరామచంద్రమూర్తి, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రాజాకాళేబ్, నియామక అధికారి పావనిప్రియ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం

సినిమాలు: దానవాయిపేట: శ్యామల, శివజ్యోతి, ఊర్వశి, వీవీఎస్ మహల్: వేట్టయన్, రాజా, అశోక, కుమారి, సూర్యప్యాలస్, అప్సర: దేవర, స్వామి, అనుశ్రీ: స్వాగ్, సూర్యమినీ: దక్షిణ, రంభ: కమిటీ కుర్రోళ్లు, మేనక: సత్యం సుందరం.

కాంగ్రెస్ కూటమి విజయంపై హర్షం

దేవీచౌక్, న్యూస్‌టుడే: జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఎన్నికల్లో ఇండియా కూటమి విజయంపై నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ కూటమి విజయం సాధించిందన్నారు. ఓటర్లను మభ్యపెట్టేందుకు భాజపా ప్రకటించిన ఉచిత హామీలను ఎవరూ నమ్మలేదన్నారు. జమ్మూ కశ్మీర్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా ఇచ్చేందుకు కృషి చేస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా నెరవేరుస్తుందని పేర్కొన్నారు.

సమస్యలకు పరిష్కారం



స్పందనకు వందనం

స్థానిక కోటిపల్లి బస్టాండ్ ప్రాంతంలో రహదారి చెంత భూగర్భ డ్రెయిన్ మ్యాన్‌హోల్ సమస్యకు పరిష్కారం లభించింది. ఇక్కడి మ్యాన్‌హోల్‌పై ఇనుప మూత ఒక పక్క వెల్డింగ్ ఊడిపోయి ప్రమాదకరంగా మారడంపై 'పొంచి ఉన్న ముప్పు' శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 7న ప్రచురితమైన కథనానికి సంబంధిత నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. మ్యాన్‌హోల్‌పై ఇనుప మూతకు వెల్డింగ్ చేయించి సమస్యను పరిష్కరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్యలపై సంప్రదించాల్సిన నంబరు
80089 02897
83282 39927

వీధి దీపాలకు మరమ్మతులు

స్థానిక లూథరగిరి, మున్సిపల్ కాలనీల మధ్య వీధిలో గత కొన్ని రోజులుగా వీధిదీపాలు వెలగకపోవడంపై 'మేమున్నాం.. మీకు తోడుగా'కు అందిన ఫిర్యాదును నగరపాలకసంస్థ సంబంధిత విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సంబంధిత విభాగం సిబ్బంది వచ్చి వీధిదీపాలకు మరమ్మతుల చేయడంతో ప్రస్తుతం అవి వెలుగుతున్నట్లు ఫిర్యాదుదారుడు జార్జి తెలిపారు.

– న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

సుందరీకరణ పనులు పూర్తయ్యేదెన్నడో..?

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయంలో సుందరీకరణ పేరిట సుమారు రూ. 20 కోట్లతో తలపెట్టిన అభివృద్ధి పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం మారినా.. పనులు తీరు మాత్రం మారలేదు. ఏడాదిన్నర కిందట తలపెట్టిన పనులు ముందుకు సాగడం లేదు. నగర వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఎక్కడెక్కడంటే..

సుందరీకరణ పేరిట వై-జంక్షన్ నుంచి కంబాల చెరువు , దేవీచౌక్, గోకవరం బస్టాండ్ మీదుగా పుష్కర ఘాట్ వరకు రోడ్డు విస్తరణతోపాటు మోడ్రన్ రోడ్డుగా తీర్చిదిద్దేందుకు సుమారు రూ. 5 కోట్లతో పనులు చేపట్టారు. ఎన్నికలకు ముందు అప్పటి ముఖ్యమంత్రి జగన్ ప్రచారానికి వస్తున్నారనే హడావుడిలో రోడ్డు మధ్యలో డివైడర్‌తోపాటు అలంకరణగా ఇరువైపులా విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. అయితే చుట్టూ గ్రీనరీ ఏర్పాటుతో పాటు వై-జంక్షన్ వరకు పూర్తిస్థాయిలో పనులు చేపట్టాల్సి ఉంది. గ్రీనరీ కోసం ఇంకా ఎటువంటి పనులు చేపట్టలేదు. లోతట్టు ప్రాంతాల్లో ముంపు నివారణలో భాగంగా తుమ్మలావ, ఆర్యాపురం వరకు



జగన్ వస్తున్నారని గోకవరం బస్టాండ్ రోడ్డు మధ్యలో హడావుడిగా పనులు (పాత చిత్రం)

చేపట్టిన కాలువ నిర్మాణం ఒక వైపే పూర్తయింది. ఎగువన లలితానగర్ నుంచి కృష్ణానగర్, ఆదెమ్మదిబ్బ మీదుగా ఎన్ఆర్‌సీపీ ప్లాంటు వరకు కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కాలువ నిర్మాణం పూర్తయితే అదనంగా మరో రూ. 2 కోట్లతో రోడ్డు నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంది. ఎన్నికలకు ఏడాది ముందు నుంచి ఈ పనులు చేపట్టినా ఇప్పటికీ పూర్తి కాకపోవడం గమనార్హం. కాలువ నిర్మాణం కోసం రోడ్డును మధ్యలో తవ్వేసి వదిలేయడం వల్ల వర్షాకాలంలో నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఇక ప్రత్యేక నిధులతో హుక్కుంపేట వద్ద మోడ్రన్ శ్లాటర్ హౌస్ నిర్మాణం చేపట్టారు. సుమారు రూ. 4 కోట్ల నిధులు పనులు చేపట్టగా, ఇప్పటికే భవన నిర్మాణం పూర్తయింది. యంత్రాలు, ఇతర పనులు పూర్తి చేయాల్సి ఉంది. రెండేళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. స్మార్ట్ రోడ్డు పేరుతో వై-జంక్షన్ నుంచి లాలాచెరువు వరకూ రూ. 5 కోట్లతో చేస్తున్న పనులు చివర్లో ఉంది. ఇక ఎంపిక చేసిన ప్రాంతాల్లో రోడ్లు, కాలువల ఆధునికీకరణ, సీసీ రోడ్ల ఏర్పాటుకు సంబంధించి సుమారు రూ. 10 కోట్ల పనులు జరుగుతున్నాయి. ఇవన్నీ గతంలోనే ప్రారంభించినప్పటికీ పూర్తి కావడం లేదు. వీటిలో కొన్ని ప్రారంభించి పనులు ఆలస్యంగా కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అట్టహాసంగా పనులు చేపట్టినప్పటికీ నిధులు సకాలంలో విడుదల చేయక పోవడం వల్లే గుత్తేదారులు పనులు ఆలస్యం చేస్తున్నారు. అయితే ఆ ప్రభావం నగర అభివృద్ధిపై పడుతుంది. పైగా పనులు మధ్యలో ఉండడం వల్ల ఆయా ప్రాంతాల్లో ప్రజలు అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్నారు.

నోటీసులు జారీ చేస్తున్నాం..

గతంలో తలపెట్టిన పనులు ఆలస్యంగా కొనసాగుతున్న వాటిని గుర్తించడం జరిగింది. సంబంధిత గుత్తేదారులకు నోటీసులు కూడా జారీ చేస్తున్నాం. మధ్యలో వరదల ప్రభావం ఇసుక కొరత పనులకు ఆటంకం ఏర్పడింది. ఇటీవలే ప్రభుత్వానికి విన్నవించి మూడు టన్నుల ఇసుక దిగుమతి చేసుకోవడం జరిగింది. సకాలంలో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకొంటాం.

– మున్సిపల్ ఎస్ఈ పాండురంగారావు

మురుగు నీటి శుద్ధి కర్మాగారం పరిశీలన

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : రాజమహేంద్రవరం ఆవరోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న మురుగు నీటి శుద్ధి కర్మాగారాన్ని బుధవారం పరిశీలించినట్లు గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టి.కె.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. రూ. 95.50 కోట్లతో చేపడుతున్న ఈ కర్మాగారం వల్ల రాజమహేంద్రవరం నగరం కాలువల నుంచి వచ్చే మురుగు నీరు శుద్ధి అవుతుందన్నారు. వచ్చే ఏడాది ఆగస్టు నాటికి నిర్మాణం పూర్తవుతుందని మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ పాండురంగారావు చెప్పారన్నారు. గోదావరి పరిరక్షణ కోసం గతంలో తాను 46రోజులపాటు చేసిన దీక్ష ఫలించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఈఈ ఆలీ, ఏఈ శ్రీధర్, గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రాలో మరో ఏడుగురికి ఆశ్రయం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్రా వృద్ధుల కేంద్రంలో గత వారం రోజుల్లో ఏడుగురికి ఆశ్రయం కల్పించినట్లు నిర్వాహకుడు గుబ్బల రాంబాబు తెలిపారు. ఇప్పటికే 30 మందికి ఆశ్రమంలో వసతి కల్పించామన్నారు.

నగర సుందరీకరణకు ప్రాధాన్యం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర పచ్చదనం విస్తరణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల ఆధునికీకరించిన దానవాయిపేట పార్కును బుధవారం రాత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రానున్న పుష్కరాల నేపథ్యంలో నగరాన్ని అన్ని విధాలుగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా పార్కుల్లో గ్రీనరీ పెంచడంతోపాటు, రోడ్లు, కాలువల విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. రోడ్లకు ఇరువైపులా మొక్కల పెంపకాన్ని చేపడతామన్నారు. జంక్షన్లను గుర్తించి, ఇప్పటి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు , పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు రామ్మోహనరావు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు చిరస్మరణీయులని పలువురు కొనియాడారు. రామ్మోహనరావు 19వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక కంబాలచెరువు జంక్షన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి వైకాపా యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి గూడూరి శ్రీనివాస్, రుడా మాజీ ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్‌పర్సన్ షర్మిలారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



కంబాలచెరువు జంక్షన్ వద్ద మాజీ మంత్రి రామ్మోహనరావు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

'ఎమ్మెల్యేపై లేనిపోని ఆరోపణలు తగదు'

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌పై మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తెదేపా నాయకులు విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెదేపా బీసీ సాధికార సమితి శెట్టిబలిజ విభాగం రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, ఆర్యాపురం బ్యాంకు డైరెక్టర్ బుడ్డిగ రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను పారదర్శకంగా ఆన్‌లైన్ వేలం నిర్వహిస్తుంటే.. భరత్‌రామ్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని తెలిపారు. వాస్తవానికి మద్యం దుకాణం కోసం ఆయన కూడా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గీత కార్మికులకు 10 శాతం దుకాణాలు కేటాయిస్తామని చెప్పారు. వైకాపా హయాంలో బీసీలకు జరిగిన మేలు ఏమీ లేదన్నారు. ఇసుకలో ఎమ్మెల్యేకు వాటా అంటూ మాజీ ఎంపీ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, వాస్తవాలు తెలియకుండా ఆదిరెడ్డి వాసుపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మరోసారి ఎమ్మెల్యే శ్రీనివాస్, అతని కుటుంబంపై అవాకులు, చెవాకులు పేలితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెదేపా నాయకులు కదలి రామకృష్ణ, కడియాల భద్రరావు, చింతపల్లి నాని, రాయుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం చండీ హోమం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, రాష్ట్రాభివృద్ధికి అమ్మ ఆశీస్సులు నిండుగా ఉండాలని కోరుతూ బుధవారం శ్రీరామనగర్‌లోని వినాయక ఆలయ ప్రాంగణంలో తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ చండీ హోమం, పూర్ణాహుతి జరిపించారు. మంత్రి కందుల దుర్గేష్, నగర, గ్రామీణ, రాజానగరం ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొని పూజలు చేశారు.



చండీ హోమంలో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్ తదితరులు

సంఘటితంగా ఉంటేనే సమస్యల పరిష్కారం

కాకినాడ నగరం: లారీ యజమానుల సంఘ నాయకులు తమ సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలని అమలాపురం లారీ యజమానుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నల్లం రాంబాబు, వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కాకినాడ లారీ యజమానుల సంఘానికి ఇటీవల నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఉమ్మడి జిల్లాలోని 29 సంఘాల యూనియన్ నాయకులు సత్కరించారు. స్థానిక సంజయ్‌నగర్ లారీ యజమానుల సంఘ కార్యాలయంలో బుధవారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్వరలోనే ఉమ్మడి జిల్లా పరిధిలో యూనియన్ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, సమస్యలపై చర్చిస్తామన్నారు. కాకినాడ లారీ యజమానుల సంఘ అధ్యక్ష కార్యదర్శులు దాసరి శ్రీనివాసరావు, అల్లం రాజు, కోశాధికారి గణేసుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అరిగెల్ల రంగబాబు, కేవీ అర్జునరావు, చిట్నీని సత్యనారాయణ, ఉద్దా శ్రీనివాస్, కాండ్రేగుల సతీష్, యలమంచిలి సత్తిబాబు, జేఎస్ తదితరులు పాల్గొన్నారు. బలభద్రపురం, రాజమహేంద్రవరం, రాజోలు లారీ యజమానుల సంఘం నాయకులు సుధాకరరెడ్డి, బాబు, కాయల రమేష్, బొక్కా త్రిమూర్తులు తదితరులు సంఘీభావం తెలిపారు.



కార్యవర్గాన్ని సత్కరిస్తున్న జిల్లా సంఘ నాయకులు

ప్రపంచ తపాలా దినోత్సవం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో నగరంలోని ప్రధాన పోస్టల్ కార్యాలయంలో ప్రపంచ తపాలా దినోత్సవం నిర్వహించి ప్రధాన పోస్ట్‌మాస్టర్ జి.సువర్ణరాజును సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు తపాలాశాఖలో సేవలు విస్తరించి, ప్రజలందరికీ చేరువయ్యేందుకు కృషి చేస్తున్నామన్నారు. పోస్ట్‌మేన్లు సేనాపతి కామరాజు, శ్రీనివాసరావు, లక్ష్మణ్‌లను సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు మద్దుల శ్రీరామగుప్తా, వెన్నా కుమారస్వామి, గ్రంధి వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.



పోస్ట్ మాస్టర్ సువర్ణరాజును సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆనం కళాకేంద్రం.. సమస్యలతో సతమతం

ఆనం కళాకేంద్రంలో మరుగుదొడ్లు శుభ్రంగా లేక సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ కార్యక్రమాలపై ఈ కేంద్రానికి నిత్యం వందల మంది స్థానికులు, సందర్శకులు వస్తుంటారు. స్వర్ణాంధ్ర-47 విజన్ జిల్లా స్థాయి సమావేశం బుధవారం జరిగింది. ఇందులో పాల్గొనేందుకు పలు సంస్థలు, పరిశ్రమల నుంచి ప్రముఖులు విచ్చేశారు. పగిలిన పలకలు, పని చేయని నీటి గొట్టాలు, అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు వంటివి చూసి పలువురు పెదవివిరుస్తున్నారు. కార్యక్రమం నిర్వహణకు వేలాది రూపాయలు తీసుకునే కళాకేంద్రంలో ఇటువంటి దుస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా శ్రద్ధ వహించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



పగిలిన టాయిలెట్ పలకలు



చేతులు శుభ్రం చేసుకునే తొట్టె

– న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్

రైల్వే మెముకార్ షెడ్‌లో పీసీఎంఈ తనిఖీలు

వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని రైల్వే మెముకార్ షెడ్‌లో బుధవారం దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీరు(పీసీఎంఈ) సి.మధుసూదనరావు తనిఖీలు నిర్వహించారు. ఇక్కడి విభాగాలను పరిశీలించి మెము రైళ్ల నిర్వహణ తీరు, విధి నిర్వహణలో సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్(ఎస్‌సీఆర్ఎంయూ) సహాయ డివిజన్ కార్యదర్శి కె.విజయకుమార్, సహాయ కార్యదర్శి కె.రమేష్ ఇక్కడి సమస్యలను పీసీఎంఈ దృష్టికి తీసుకెళ్లారు. పెరిగిన పనిభారానికి అనుగుణంగా అదనపు పోస్టులు మంజూరు చేయాలని, మహిళా కార్మికులకు వసతులు కల్పించాలని, పిన్‌పాయింటింగ్ పేరుతో కార్మికులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడం నిలిచిపివేయాలని, మెము రైళ్లను శుభ్రపరిచేందుకు ప్రత్యేక పిట్ నిర్మించాలని కోరుతూ ఆయనకు వినతి పత్రం అందజేశారు.



పీసీఎంఈ మధుసూదనరావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, కార్మికులు

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

టి.నగర్ (రాజమహేంద్రవరం): లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరమని, వాటిని ప్రోత్సహిస్తే చర్యలు తప్పవని రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణ నాయక్ తెలిపారు. తమ కార్యాలయంలో సీపీపీఎన్‌డీటీ చట్టంపై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో లింగ వివక్షతను వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ఏ స్కానింగ్ కేంద్రాల్లోనైనా పరీక్షలు చేసినట్లు నిర్ధారిస్తే వాటిని మూసివేస్తామన్నారు. సంబంధిత వైద్యుడికి జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు. ప్రతీ నెలా నిర్దిష్టంగా స్కాన్ సెంటర్లను ఆకస్మిక తనిఖీలు చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఆయా మండలాలకు చెందిన ఐసీడీఎస్ అధికారులు, ప్రభుత్వ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



దేవీచౌక్‌లో బాలా త్రిపుర సుందరీదేవికి కుంకుమార్చన



మార్కండేయస్వామి ఆలయంలో పార్వతీదేవికి అలంకారం



శృంగేరీ శారదా పీఠంలో..



అష్టలక్ష్మీ ఆలయంలో..



సరస్వతీఘాట్‌లో..



వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో



మోరంపూడి సాయినగర్-2లో..

వీణాధారిణి.. విద్యాప్రదాయిని



మల్లయ్యపేటలో సరస్వతి పూజలో విద్యార్థులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, వీఎల్ పురం, ఏవీఏ రోడ్డు న్యూస్‌టుడే : చదువుల తల్లి సరస్వతీదేవి జన్మనక్షత్రం మూలా కావడంతో రాజమహేంద్రవరం నగరంలోని పలు ఆలయాల్లో బుధవారం వైభవంగా పూజలు జరిగాయి. గోదావరిగట్టున ఉన్న శ్రీఉమా మార్కండేయస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారి మూలవిరాట్‌కు పట్టువస్త్రాలతో అలంకరించి పుస్తకాలు, పెన్నులు చెంతన ఉంచి పూజలు చేశారు. ✦ సీతంపేట రామాలయంలో 108 మంది చిన్నారులతో సామూహిక సరస్వతీ పూజలు చేయించారు. ✦ గోదావరిగట్టున ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని సగ్గుబియ్యంతో అలంకరించి కుంకుమార్చన నిర్వహించారు. ✦ సరస్వతీ ఘాట్ వేదికపై బుధవారం సాయంత్రం జరిగిన సాంస్కృతిక ప్రదర్శన అలరించింది ✦ మోరంపూడి సాయినగర్-2లో శ్రీవిజయ కనకదుర్గమ్మ ఆలయం వద్ద నిర్వహించిన సరస్వతీ పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

దేవీచౌక్‌లో నేడు

దేవీచౌక్‌లో అమ్మవారికి గురువారం శ్రీదుర్గాదేవి అలంకారం, రాత్రి 10గంటలకు భూకైలాస్ నాటక ప్రదర్శన ఉంటుంది.



సరస్వతీఘాట్ వేదికపై కళాకారుల నృత్య ప్రదర్శన

రైలు ఢీకొని మహిళ మృతి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. కేశవరం రైల్వే గేటు సమీపంలో బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. రాజమహేంద్రవరం జీఆర్పీ ఎస్సై మావూళ్లు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలి వయసు సుమారు 55 ఏళ్లు ఉంటాయి. ఒంటిపై పసుపు, పచ్చ, ఎరుపు రంగుల డిజైన్ చీర, పచ్చరంగు జాకెట్ ధరించి ఉంది. ఆమె ఏ ప్రాంతానికి చెందినది అనేది ఇంకా తెలియలేదని, వివరాలు తెలిసినవారు 94910 03239 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్సై కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యానం.. ఏదీ ఆహ్లాదం..?

సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచాల్సిన ఉద్యానాలు అధ్వానంగా తయారై ఆవేదన మిగులుస్తున్నాయి. నిర్వహణ లోపంతో ఆవరణలు పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో నిండిపోతున్నాయి. సాయంత్రమైతే మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. రాజమహేంద్రవరం ఆర్యాపురంలోని డాక్టర్ ఏబీ నాగేశ్వరరావు ఉద్యానం నిర్వహణ అధ్వానంగా ఉంది. లోపలున్న చెరువు పూర్తిగా ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. వాంబే గృహాల వైపు ఉన్న ప్రహరీ ఒక పక్కకు ఒరిగిపోయి ఎప్పుడు కూలిపోతుందో తెలియని దుస్థితి. చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయింది. పార్కులో సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన బెంచీల వద్ద ఖాళీ మద్యం, ప్లాస్టిక్ సీసాలు, గ్లాసులు దర్శనమిస్తున్నాయి. ఉదయం, సాయంత్ర నడక, వ్యాయామానికి వచ్చే వారికి దుర్వాసన, అపరిశుభ్ర వాతావారణం స్వాగతం పలుకుతోంది. గతంలో ఉదయం, సాయంత్రం కలిపి సుమారు 300 నుంచి 400 వరకు నడక, వ్యాయామానికి వచ్చేవారని, ప్రస్తుతం ఆ సంఖ్య బాగా తగ్గిందని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో మందుబాబులు, గంజాయి బ్యాచ్‌లకు నిలయంగా మారుతోందన్నారు. రాత్రిపూట పార్కులోకి వెళ్లేందుకు సామాన్యులెవరూ సాహసించలేకపోతున్నారని తెలిపారు. పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధిచేసి మళ్లీ సందర్శకులు, నడక వ్యాయామదారులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.



నడకదారిలో చెత్త



బెంచీల వద్ద ఖాళీ మద్యం సీసాలు



పార్కులోని చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు

– న్యూస్‌టుడే, దేవీచౌక్

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

అనపర్తి సీఐగా సుమంత్

అనపర్తి గ్రామీణం: అనపర్తి సీఐగా వీఎల్‌కే సుమంత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కాకినాడ పోర్టు సీఐగా ఆయన పనిచేశారు. ఇప్పటి వరకు అనపర్తి సీఐగా పనిచేసిన శివగణేష్ వీఆర్‌కు బదిలీ అయ్యారు.

సినిమాలు

దానవాయిపేట: శ్యామల, శివజ్యోతి, ఊర్వశి, వీఏస్ మహల్: **వేట్టయన్,** రాజా, అశోక్, కుమారి, సూర్యప్యాలస్, అప్సర: **దేవర,** స్వామి, అనుశ్రీ: **స్వాగ్,** సూర్యమినీ: **దక్షిణ,** రంభ: **కమిటీ కుర్రోళ్లు,** మేనక: **సత్యం సుందరం.**

రంగంపేటలో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



ఎస్పీ.. సిబ్బందికి సూచనలిస్తున్న నరసింహ కిషోర్

రంగంపేట: రంగంపేట పోలీసు స్టేషన్‌ను బుధవారం సాయంత్రం ఎస్పీ నరసింహ కిషోర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణ, రిసెప్షన్ సెంటరు, సీసీ కెమెరాల పనితీరును ఆయన పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల వివరాలపై ఆరా తీయడంతో పాటు.. వివాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై కృష్ణసాయిని ఆదేశించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వ్యర్థాలు తొలగించాలి



- న్యూస్‌టుడే, ధవళేశ్వరం

సమస్య: ధవళేశ్వరం మెయిన్‌రోడ్డులో స్టేట్ బ్యాంకు పక్క నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు కాలువలో పూడిక తొలగించి వ్యర్థాలను రహదారిపై వదిలేశారు. దాంతో ఆ ప్రాంతంలో వ్యాపార సముదాయాలకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నాం. - మీసాల హరిబాబు, స్థానికుడు

సమాధానం: వెంటనే సిబ్బందిని పంపి వ్యర్థాలను తొలగిస్తాం. - వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి, ధవళేశ్వరం

సమస్య: ఇళ్లపల్లిలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాత్రుళ్లు కుక్కలు, దొంగల భయంతో ఇబ్బంది పడుతున్నాం. పంచాయతీ అధికారులు ఇప్పటికైనా తక్షణం వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలి. - ఇళ్లపల్లి గ్రామస్థులు

సమాధానం: పంచాయతీ విద్యుత్ పరమైన మరమ్మతులు చేసే ఉద్యోగిపై ఫిర్యాదులు అందుతున్నాయి. రెండు రోజుల్లో వీధి దీపాలు అన్నీ వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - వంశీ, పంచాయతీ కార్యదర్శి, ఇళ్లపల్లి

- న్యూస్‌టుడే, బిక్కవోలు

తాగునీరు వృథా

సమస్య: బొమ్మూరు కాశీకృష్ణనగర్ మూడో వీధిలో పైపులైను పగిలి రెండు రోజుల నుంచి తాగునీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. - వెంకట్, స్థానికుడు

సమాధానం: పైపులైనుకు మరమ్మతులు చేయించి నీటి వృథాను నియంత్రిస్తాం. - శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి

- న్యూస్‌టుడే, బొమ్మూరు

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: **91212 29057,** కడియం: **91212 29062,** అనపర్తి: **91000 20947**

రైతుకు కష్టం.. తీరని నష్టం

- రూ.400 విలువైన క్లాంప్స్ చోరీలతో అన్నదాత బెంబేలు
- రంగంపేటలో మూడు రోజుల్లో 26 పైనే హాంఫట్

న్యూస్‌టుడే, రంగంపేట

అన్నదాతలకు మరో కొత్త తలనొప్పి వచ్చింది. ఓ వైపు వ్యవసాయ బోర్ల కాపర్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి వైరు చోరీలు కొనసాగుతుండగా.. ఇప్పుడు బోర్ల క్లాంపుల చోరీకి దొంగలు మెట్టలో తెర లేపారు. చోరీదారులకు వీటితో గోరంత ఉపయోగమే అయినా తిరిగి బోరుకు మరమ్మతులు చేయించుకుని యథాస్థితికి తెచ్చేందుకు అన్నదాతకు మాత్రం వేలల్లో వ్యయమవుతోంది. వ్యవసాయ బోరు గొట్టం లోపలకు మోటారును దించి నీరు ఉన్న చోట మోటారును అమర్చుతారు. అధిక బరువైన మోటారు లోపల పడిపోకుండా పైభాగాన ఏర్పాటు చేసే ఈ క్లాంప్‌లే ఆధారం. ఇనుముతో తయారు చేసిన వీటి విలువ మార్కెట్‌లో రూ.400 నుంచి రూ.800 వరకు ఉండగా వీటిని చోరీ చేసి విక్రయిస్తే రూ.200 లోపే వస్తుంది. అయితే, దొంగలు వీటిని తొలగించినప్పుడు గొట్టంతో పాటు మోటారు భూగర్భంలోకి జారిపోతుంది. దానికి తిరిగి యథాస్థానానికి తీసుకురావాలంటే ఒక్కో బోరుకు రూ.5వేల నుంచి రూ.25వేల వరకు వ్యయమవుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మెట్టలో ఇటీవల ఈ తరహా చోరీలు ఎక్కువ కాగా.. రంగంపేటలోనే గత మూడు రోజుల్లో 26బోర్ల వద్ద ఇదే తరహా పరిస్థితి కల్పించారు.



రంగంపేటలో చోరీకి గురైన వ్యవసాయ బోరు

నాకు రూ.25వేలు ఖర్చయింది



నేను 6 ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాను. నా వ్యవసాయ బోరుకు చెందిన క్లాంప్ చోరీతో 200 అడుగుల లోతులో ఉన్న మోటారు మరో 260 అడుగులకు జారిపోయింది. సంబంధిత సిబ్బందిని తీసుకుని వచ్చి గొట్టాన్ని, బోరు మోటారును యథాస్థితికి చేర్చడానికి రూ.25వేల వరకు ఖర్చయింది.

– ఆరుమిల్లి వాసు, కౌలు రైతు, రంగంపేట

ప్రత్యేక నిఘా పెట్టాలి..



మెట్టలో బోర్ల వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి, క్లాంప్‌ల చోరీలు తలనొప్పిగా మారాయి. రాత్రులు పొలాల్లోకి వెళ్లడానికి భయపడే పరిస్థితి ఏర్పడింది. దీంతో మాకు ఆర్థికంగా భారంతో పాటు, సరి చేసేందుకు సమయం వృథా అవుతోంది. ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.

– జుజ్జవరపు జమి, కౌలు రైతు, రంగంపేట

వెదుళ్లపల్లి సొసైటీకి ఇన్‌ఛార్జి సీఈవో నియామకం

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం మండలం వెదుళ్లపల్లి సొసైటీ ఇన్‌ఛార్జి సీఈవోగా ఎం.శివరామకృష్ణను నియమించినట్లు డీసీసీబీ మేనేజర్ మిరియం ప్రియాంక బుధవారం తెలిపారు. ప్రస్తుతం ఆమె ఇనుగంటివారిపేట సీఈవోగా పనిచేస్తున్నారు. ఆమెకు సొసైటీ ఇన్‌ఛార్జి మునికూడలికి చెందిన విశ్రాంత ఉద్యోగి జీవీ రామారావును నియమించామన్నారు. కాగా సొసైటీలో నిధుల దుర్వినియోగంపై వెదుళ్లపల్లి సొసైటీ సీఈవోతో పాటు ఉన్న మరో ఇద్దరు ఉద్యోగులను విధుల నుంచి సహకార శాఖ అధికారులు తొలగించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో బ్యాంకు లావాదేవీలు యథావిధిగా నిర్వహించేలా తాత్కాలిక నియామకాలు చేపట్టమన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

రంగంపేట: రంగంపేట పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకం కింద గర్భిణులకు బుధవారం వైద్య పరీక్షలు జరిగాయి. 36 మంది హాజరుకాగా వారికి ఆరోగ్య పరీక్షలు చేసి ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మి, వైద్యురాలు కె.సంకీర్తన వివరించారు.

శివాలయం పునర్నిర్మాణానికి కసరత్తు

రంగంపేట: రంగంపేటలోని ప్రాచీన ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రంగం సిద్ధమవుతోంది. బుధవారం ఆలయ ప్రాంగణంలో మెరక చేసే పనులు చేపట్టారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి భక్తులతో, దేవాదాయశాఖ అధికారులతోనూ ఇటీవల సమీక్షించి ఆలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించగా.. ఏడు ప్రాచీన ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరైన విషయం తెలిసిందే. అందులో భాగంగా రంగంపేట శివాలయానికి రూ.2.10కోట్లు మంజూరు కాగా.. భక్తుల వాటాగా విరాళాల రూపంలో రూ.70 లక్షల వరకు సమకూర్చారు. దీంతో అభివృద్ధి పనులు ప్రారంభించారు.



శివాలయ ప్రాంగణంలో అభివృద్ధి పనులు

ఇదేం.. చెత్తశుద్ధి?



బొమ్మూరు విద్యుత్తు ఉపకేంద్రం బయట ప్రహరీ పొడవునా చెత్త పేరుకుపోయింది. అపరిశుభ్రత కనిపిస్తున్నా అధికారులకు మాత్రం పట్టడం లేదు. కొంతమంది అక్కడి చెత్తను బహిరంగంగానే కాల్చేస్తున్నారు. బొమ్మూరు చెరువుగట్టు వద్ద రోజుల తరబడి చెత్త గుట్టలుగా ఉంటున్నా తొలగించడం లేదు. సమస్యపై కార్యదర్శి కాశిని వివరణ కోరగా పారిశుద్ధ్య సిబ్బందితో తొలగిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, బొమ్మూరు

జక్కంపూడికి నివాళి

కడియం, న్యూస్‌టుడే: ప్రజాసమస్యలపై అనుక్షణం పోరాడిన జన యోధుడు జక్కంపూడి రామ్మోహనరావు అని జేగురుపాడు సర్పంచి యాదల సతీశ్‌చంద్రస్టాలిన్ కొనియాడారు. స్థానికంగా జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కడియపులంక పరిధి దోశాలమ్మకాలనీలో అఖిల భారత నర్సరీ సంఘం మాజీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం స్థానిక రైతులతో కలిసి జక్కంపూడి విగ్రహానికి ఆయన వర్ధంతిని పురస్కరించుకుని పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మంత్రిగా, ఎమ్మెల్యేగా నర్సరీ రంగానికి ఆయన చేసిన సేవలను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఆకుల సుధాకర్, పాలపర్తి ప్రకాశ్‌కుమార్, పుట్టా బుజ్జి, వనమాలి రాంపండు తదితరులు పాల్గొన్నారు.



కడియపులంకలో నివాళి అర్పిస్తున్న రైతులు

సంఘటితంగా ఉంటేనే సమస్యల పరిష్కారం



కార్యవర్గాన్ని సత్కరిస్తున్న జిల్లా సంఘ నాయకులు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: లారీ యజమానుల సంఘ నాయకులు తమ సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలని అమలాపురం లారీ యజమానుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నల్లం రాంబాబు, వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కాకినాడ లారీ యజమానుల సంఘానికి ఇటీవల నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఉమ్మడి జిల్లాలోని 29 సంఘాల యూనియన్ నాయకులు సత్కరించారు. స్థానిక సంజయ్‌నగర్ లారీ యజమానుల సంఘ కార్యాలయంలో బుధవారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్వరలోనే ఉమ్మడి జిల్లా పరిధిలో యూనియన్ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, సమస్యలపై చర్చిస్తామన్నారు. కాకినాడ లారీ యజమానుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి శ్రీనివాసరావు, అల్లం రాజు, కోశాధికారి గణేసుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అరిగెల్ల రంగబాబు, కేవీ అర్జునరావు, చిట్నిని సత్యనారాయణ, ఉద్దా శ్రీనివాస్, కాండ్రేగుల సతీష్, యలమంచిలి సత్తిబాబు, జేఎస్ తదితరులు పాల్గొన్నారు. బలభద్రపురం, రాజమహేంద్రవరం, రాజోలు లారీ యజమానుల సంఘం నాయకులు సుధాకరరెడ్డి, బాబు, కాయల రమేష్, బొక్కా త్రిమూర్తులు తదితరులు సంఘీభావం తెలిపారు.

ఎన్నాళ్లీ ఇబ్బంది



స్థానిక క్వారీ కెనాల్‌రోడ్డులో రహదారిపై పలు చోట్ల గుంతలు పడటంతో అటుగా ప్రయాణించే వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కల్వర్టు వద్ద మూడు రోడ్ల కూడలిలో, మరో రెండు చోట్ల రహదారి పూర్తిగా దెబ్బతింది. కొద్దిపాటి వర్షం కురిసినా గుంతలలో నీరుచేరిపోయి వాహనదారులకు పాట్లు తప్పడం లేదు. అధికారులు స్పందించాలని వేడుకుంటున్నారు. ఈ విషయమై ర.భ.శాఖ ఏఈ వి.కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా గుంతలను పూడ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. -న్యూస్‌టుడే, ధవళేశ్వరం

జగజ్జనని.. జై భవాని



దుళ్లలో శ్రీసరస్వతీదేవిగా శారదాదేవి



కడియంలో సరస్వతీదేవి పూజల్లో పాల్గొన్న భక్తులు

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం పలు ఆలయాల్లో సరస్వతీ అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వగా.. చిన్నారులు సరస్వతీపూజలో పాల్గొన్నారు. సీతానగరంలో శ్రీరామనగరం, నడుందొడ్డి కూడలి, వెలంపేటలోని ధనమ్మ ఆలయం.. బొమ్మూరు నేతాజీనగర్.. బిక్కవోలు, కొంకుదురు, రంగంపేట మండలంలోనూ ప్రత్యేక పూజలు చేపట్టారు. కడియపులంక హరిహర మహాక్షేత్రం, దుళ్ల మార్కెట్ సెంటర్ శారదా దేవి ఆలయంలోనూ పూజలు జరిగాయి. హుకుంపేట నాగిరెడ్డినగర్ మూడుగుళ్ల వద్ద ఆలయంలో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. చక్రద్వారబంధంలో దేవీ చౌక్ వద్ద, పాలచర్లలో, అనపర్తి మండలం పొలమూరు కాలనీలో.. కోరుకొండ- కాపవరం కూడలిలోని రాజ రాజేశ్వరిదేవి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. పెదపూడి మండలం పుట్టకొండ శక్తి పీఠంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోకవరం మండలం దేవీచౌక్‌లో విశేష పూజలు చేపట్టారు.

– న్యూస్‌టుడే, సీతానగరం, బొమ్మూరు, బిక్కవోలు, రంగంపేట, కడియం, హుకుంపేట, రాజానగరం, అనపర్తి గ్రామీణం, కోరుకొండ, పెదపూడి, గోకవరం:



బొమ్మూరులో సరస్వతి దేవి అలంకారంలో..



హుకుంపేట నాగిరెడ్డినగర్ మూడుగుళ్ల వద్ద..



అనపర్తి మార్కండేయ పురంలో..



గోకవరం దేవీచౌక్ దుర్గాదేవి అమ్మవారు



రాజానగరంలో..

భూముల రీ-సర్వే తప్పులపై ప్రత్యేక గ్రామసభలు

సీతానగరం, న్యూస్‌టుడే: భూముల రీ-సర్వే జరిగిన చోట సాంకేతికపరమైన అంశాలతో కొన్ని పొరబాట్లు చోటు చేసుకోవడంపై ప్రత్యేక గ్రామసభల ద్వారా పరిష్కారం చేస్తున్నామని తహసీల్దారు అంకం శ్రీనివాసు తెలిపారు. సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం, రామచంద్రపురం గ్రామాల్లో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామసభలు నిర్వహించారు. భూముల రీ-సర్వేలో తప్పులు చోటు చేసుకోవడం.. భూముల క్రయ విక్రయాల్లో రైతుల ఇబ్బందులపై ‘ఉన్న భూమి మాయం.. లేని ఖాతాల్లో ప్రత్యక్షం’ అనే శీర్షికన ఈనెల 6న ‘ఈనాడు’లో వచ్చిన కథనంపై జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. ఆయా గ్రామాల్లో ప్రత్యేక రెవెన్యూ గ్రామసభలకు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామసభల్లో పాల్గొన్న రీ-సర్వే డిప్యూటీ తహసీల్దారు సర్వేశ్వరమూర్తి మాట్లాడుతూ.. సబ్‌డివిజన్‌లో మ్యుటేషన్ వంటి సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తామన్నారు. తమ పరిధి దాటి వీలుకాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. కాగా రీ-సర్వేలో చోటు చేసుకున్న తప్పులను సరిచేసేందుకు 75 మంది రైతులు గ్రామసభల్లో దరఖాస్తులు అందించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఈనాడు కథనానికి స్పందన



గ్రామసభలో డిప్యూటీ తహసీల్దారుకు దరఖాస్తు అందజేస్తున్న రైతులు

ధాన్యం అమ్మకాలకు అనుమతించాలని వినతి



నాదెండ్ల మనోహర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: పెదపూడి మండలంలో రైతులు పండించిన ధాన్యాన్ని అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు మండలాల రైసు మిల్లులకు అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలని.. రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కొవ్వూరు క్యాంపు కార్యాలయంలో బుధవారం వినతిపత్రాన్ని ఇచ్చానని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా విభజనలో భాగంగా పెదపూడి మండలం కాకినాడ జిల్లాకు మార్చారన్నారు. భౌగోళికంగా అనపర్తి నియోజకవర్గంలో ఉందని చెప్పారు. దీనికి తోడు బిక్కవోలు మండలానికి ఆనుకుని ఉందని.. గత నాలుగు దశాబ్దాలుగా పెదపూడి మండల రైతులు బిక్కవోలు మండలంలోని రైసుమిల్లులకు ధాన్యం రవాణా చేస్తున్నారన్నారు. కాకినాడ జిల్లాలో తక్కువగా రైసుమిల్లులు ఉండటం.. అదీ మండలానికి దూరంగా ఉండటం ఇక్కడ సమస్యగా మారిందని ఎమ్మెల్యే అన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని రైతుల నుంచీ అభ్యర్థనలు రాగా.. ఆ మేరకు మంత్రిని అభ్యర్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయనా సానుకూలంగా స్పందించినట్లు నల్లమిల్లి వివరించారు.

ఎండాకు తెగులుపై దృష్టి సారించాలి



కోరుకొండ: నరసాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం..

కోరుకొండ, కడియం, రంగంపేట: సార్వా పంటకు ఎండాకు తెగులు సోకిందని, నివారణపై రైతులు దృష్టి సారిస్తే మంచి దిగుబడి వస్తుందని ఏడీఏ బీకే మల్లికార్జునరావు అన్నారు. కోరుకొండ మండలం నరసాపురంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటరు డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు, డాక్టర్ ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కడియం మండలం దామిరెడ్డిపల్లిలో బుధవారం ఉదయం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు, ఉపసర్పంచి ముద్రగడ జెమీ పాల్గొని మాట్లాడారు. ఉద్యానశాఖ అధికారి సుధీర్‌కుమార్, ఏఓ ద్వారకాదేవి, కామేశ్వరరావు హాజరయ్యారు. రంగంపేట మండలం జి.దొంతమూరు, వీరంపాలెంలోనూ ఏవో కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

పబ్లిక్ నోటీస్

తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి పట్టణం మరియు అర్బన్ మండలం, పోస్టల్‌కాలనీ నివాసస్తులైన కోనాలు హర్షున రెడ్డి, S/o సత్యనారాయణరెడ్డి గారి సంజాయిషీపైన ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ తెలుపబడిన షెడ్యూల్ ఆస్తిని తూర్పుగోదావరి జిల్లా, కోరుకొండ మండలం, రాఘవపురం నివాసస్తులైన వేల్పుల సరసన్న, S/o సీతయ్య గారి మనుమడు శ్రీ మరుకుర్తి నరసింహమూర్తి, S/o వెంకట్రావు గారి వద్ద నుండి క్రయం పొందుటకు అంగీకరించడమైనది.

సదరు ఆస్తిని మా క్లయింటు శ్రీ మరుకుర్తి నరసింహమూర్తి, S/o వెంకట్రావు గారి నుండి క్రియం పొందుటకు ఎవరికైననూ ఏవిధమైన ఆక్షేపణలు లేదా అభ్యంతరములు ఉన్నయెడల ఈ దిగువ మా ఆఫీస్ అడ్రస్‌నకు ఈ రోజు నుండి వారం రోజులలోగా తెలుపగలరు. లేనిచో సదరు ఆస్తిని నిష్పేచి మరియు నిర్వివాదమని తలచి మా క్లయింటు సదరు షెడ్యూల్ ఆస్తిని SRO Korukonda నందు క్రయం చేసి, తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుందురు.

షెడ్యూల్ ఆస్తి వివరాలు: తూర్పుగోదావరిజిల్లా, కోరుకొండ మండలం, కోరుకొండ సబ్‌రిజిస్ట్రార్, రాఘవపురం గ్రామం, రాఘవపురం జిరాయితీ మెరక భూమి, R.S.No.71L Full Extent Ac.5-16 సెంట్లులో ఉత్తరం వైపు ఎ.1-95 సెంట్లు భూమికి హద్దులు: **తూర్పు:** నీలపాల వెంకటస్వామి గారి భూమి; **పడమర:** రోడ్డు; **ఉత్తరం:** కరణం సుబ్బారావు గారి భూమి; **దక్షిణం:** వంక కృష్ణ మరియు ఇతరుల భూమి.

ఈ హద్దుల మధ్యస్తమైన ఎక.1-95 సెంట్లు భూమి అందలి ఈజిమెంట్ హక్కులతో సహా.


G.MOHANA VAMSI
V.S.S.SRINIVAS
U.RAMA BHARATHI
Advocates & Associates
D.No.46-16-47/1, Danavaipeta, Rajahmundry.

చేయాలి న్యాయం.. కావాలి సాయం..

పోలవరం నిర్వాసితుల భారీ ర్యాలీ

గోకవరం, దేవీపట్నం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు కోసం మా ఊరిని, భూములను వదులుకున్నాం. గత వైకాపా ప్రభుత్వం మమ్మల్ని నమ్మించి నట్టేట ముంచేసిందంటూ నిర్వాసితులు బుధవారం వాపోయారు. గోకవరం మండలం కృష్ణునిపాలెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నుంచి గోకవరం శివారు గంగాలమ్మ ఆలయ సమీపంలోని దేవీపట్నం పునరావాస కాలనీ వరకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఏళ్లు గడుస్తున్నా మా సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం మా మొరను ఆలకించాలని వారు వేడుకుంటున్నారు. కొందరి ఆక్రందనలు వారి మాటల్లోనే..

మూడేళ్లుగా వివాదంలోనే ఇళ్ల స్థలాలు



దేవీపట్నం పునరావాస కాలనీకి సంబంధించి మాకు ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు. ఆ స్థలాలు కోర్టు వివాదంలో ఉండడంతో ప్రస్తుతం అక్కడ రైతులు పంటలను సాగు చేసుకుంటున్నారు. నేటికీ మా ఇళ్లకు పునాదులు వేయలేదు. గత ప్రభుత్వంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు అందించిన పట్టించుకోలేదు. ఇప్పటికైనా ఈ తొమ్మిది ఎకరాల భూ సమస్యను పరిష్కరించి మాకు న్యాయం చేయాలి. -మిత్తిరెడ్డి ఈశ్వరమ్మ, దేవీపట్నం

అద్దె చెల్లించలేక ఇక్కట్లు



గత ప్రభుత్వం ఏవిధమైన ఇంటి నిర్మాణాలు చేపట్టకుండానే ఇళ్లను ఖాళీ చేయించింది. ఇంటి అద్దెకు ఏడాదికి రూ.36 వేలు చెల్లిస్తామన్నారు. ఇప్పటికి ఒక్క రూపాయి చెల్లించలేదు. ఒక పక్క ఉపాధి లేక మరో పక్క అద్దెలు చెల్లించుకోలేక మూడేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. దీంతో కొందరు సగం సగం పూర్తయిన ఇళ్లలోనే ఏదో విధంగా ఉందామని వచ్చేస్తుంటే ఇక్కడ కనీసం ఏవిధమైన వసతులు లేవు.

- బుర్రే ఆనందరావు, దేవీపట్నం

మిగిలిన పరిహారం ఇవ్వలేదు



ఎ.వీరవరం గ్రామానికి చెందిన మాకు 2012లో 51 మందిని అర్హులుగా గుర్తించి సగం ప్యాకేజీ మాత్రమే వేశారు. ఇందులో 43 మందికి మాత్రమే పునరావాస కాలనీలను నిర్మించారు. మిగిలిన ఎనిమిది మందికి నేటికీ ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. గ్రామంలో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు గత వైకాపా ప్రభుత్వంలో దరఖాస్తులు చేసుకున్న పట్టించుకోలేదు.

- మట్టపర్తి రామకృష్ణ, ఎ.వీరవరం

ఎలా బతికేది..?



కొండమొదలులో ప్రశాంతంగా బతికేవాళ్లం. ఇక్కడకు వచ్చిన తరువాత ఉండడానికి ఇళ్లు లేక చేయడానికి ఉపాధి పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నాకు ముగ్గురు పిల్లలు కాగా ఇద్దరు పిల్లలకు పెళ్లిళ్లు అయ్యాయి. మాకు ఇచ్చిన ఇంటిలోనే అందరం ఉంటున్నాం. పెళ్లిళ్లు అయిన వారికి ఒకే ఇల్లు ఏవిధంగా సరిపోతుందో అధికారులే ఆలోచించాలి. ఇక ప్యాకేజీల కోసం ధవళేశ్వరం కార్యాలయం చుట్టు కాళ్లు అరిగేలా తిరిగాం. తీరా ఇప్పుడు మేము ఇచ్చిన కాగితాలే కాలిపోయాయి అని చెబుతున్నారు. ఇంక మేము ఎలా బతకాలి.

- ఏడిద సరోజని, కొండమొదలు

ఉద్యోగాలకు 27 మంది ఎంపిక

వి.ఎల్.పురం: నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన సంస్థలు, న్యాక్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ఉన్న న్యాక్‌లో నిర్వహించిన ఈ మేళాకు 81 మంది అభ్యర్థులు హాజరుకాగా వీరిలో 27 మంది నాలుగు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్య, ఉపాధి అధికారులు గంటా సుధాకర్, హరిశ్చంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో న్యాక్ ఏడీ జి.రాజు, ఏడీఎస్‌డీవో పెరుమాళ్, నైపుణ్య కళాశాల కోఆర్డినేటర్ శ్రీరామచంద్రమూర్తి, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రాజాకాళేబ్, నియామక అధికారి పావనిప్రియ తదితరులు పాల్గొన్నారు.

గోదారోళ్ల కితకితలు రూపశిల్పికి నివాళి

బొమ్మూరు: గోదారోళ్ల కితకితలు ఫేస్‌బుక్ పేజీ రూపశిల్పి ఈవీవీ సత్యనారాయణ జయంతిని బొమ్మూరులోని రూత్ ఓల్డ్‌ఏజ్‌హోమ్‌లో బృంద సభ్యులు బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి సతీమణి రమ, గ్రూపు ఎడ్మిన్లు సురచి మల్లిబాబు, హమయత్ మహమ్మద్ తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

మసీదుసెంటర్(కాకినాడ): రాజానగరం మండలానికి చెందిన ఎన్.మణికంఠ(32) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాదరు. గడ్డిమందు తాగిన ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో ప్రథమచికిత్స అనంతరం ఈనెల 8న జీజీహెచ్‌లో చేర్చారు. రాజానగరం పోలీసులు కేసు నమోదు చేశారు.

కొవ్వూరు
● కొవ్వూరు ● నిడదవోలు ● గోపాలపురం



భారీ వర్షం

ఉండ్రాజవరం, తాళ్లపూడి: ఉండ్రాజవరం, తాళ్లపూడి మండలాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. ప్రధాన రహదారులతో పాటు వీధులు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. వరిపైర్ల దిగుబడిపై దీని ప్రభావం పడుతోందని రైతులు చెబుతున్నారు.

ఉండ్రాజవరంలో వర్షపు నీటిలో రాకపోకలు

రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందాలి

నిడదవోలు, న్యూస్‌టుడే: రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందాలని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలం గోపవరం గుబ్బాలమ్మ వారిని బుధవారం దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులకు పుస్తకాలు అందించారు. ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాశరావు తదితరులు ఉన్నారు.



గుబ్బాలమ్మ ఆలయం వద్ద మొక్కలు నాటుతున్న మంత్రి దుర్గేష్

మేమున్నాం.. మీకు తోడుగా

వేగ నియంత్రికలు ఏర్పాటు చేయాలి

సమస్య: అనంతపల్లిలోని శివాలయం నుంచి దుండు గంగాభవానీ ఆలయం వెళ్లే రహదారిలో గతంలో వేగ నియంత్రికలు ఉండేవి. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ స్థానిక నాయకుడు వేగ నియంత్రికలను తొలగించారు. అప్పటి నుంచి ఆ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వేగనియంత్రికలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించగలరు. – సత్యప్రసాద్, స్థానికుడు

సమాధానం: సమస్యను పరిశీలించి వేగనియంత్రికలు ఏర్పాటు చేస్తాం. – శ్రీదేవి, పంచాయితీ కార్యదర్శి - న్యూస్‌టుడే, నల్లజర్ల



సమస్య: స్థానిక సినిమాహాల్ ర్యాంపునకు వెళ్లే ఏటిగట్టు రహదారి పక్కన వ్యర్థాలు పేరుకుపోయాయి. రాకపోకలు సాగించాలంటే ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. – స్థానికుడు, తాళ్లపూడి

సమాధానం: రహదారి పక్కన వ్యర్థాలను తొలగిస్తాం. దుర్వాసన రాకుండా చర్యలు తీసుకుంటాం. – వీరన్న, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, తాళ్లపూడి

ప్రమాదభరితంగా తీగలు



పెరవలి మండలం నడుపల్లికోటకు చెందిన ఎరమోలు శ్రీనివాసు ఇంటిపై నుంచి విద్యుత్తు తీగలు ఉండటంతో పలు ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన ఇంటిపై నుంచి తొలగించాలని వాపోతున్నారు. - న్యూస్‌టుడే, పెరవలి

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497 నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

తాగునీటి కష్టాలు.. ఎన్నాళ్లు!

తాళ్లపూడి, న్యూస్‌టుడే

తాళ్లపూడిలో 2016 సంవత్సరంలో ఏర్పాటు చేసిన జాతీయ గ్రామీణ తాగునీటి పథకం తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మోటార్లు పాడవడం, పైపులైన్లు లీకవడం తదితర కారణాలతో శుద్ధినీరు సరఫరా కాక పలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పథకం నిర్వహణకు మంజూరైన అరకొర నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేయిస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు.

పథకం వివరాలు..

నిర్మాణ నిధులు	: రూ.11కోట్లు(నాబార్డు)
పైపులైను నిర్మాణం	: 40 కి.మీ
ఉద్దేశం	: గోదావరి నీటిని శుద్ధిచేసి సరఫరా చేయడం
గ్రామాలు	: 17, సిబ్బంది : 11మంది
రోజుకు సరఫరా చేసే శుద్ధినీరు	: 50లక్షల లీటర్లు
నిర్వహణ	: జిల్లాపరిషత్తు నుంచి ఏడాదికి రూ.50 లక్షలు

తరచూ మరమ్మతులతో ఇబ్బందులు..



జాతీయ గ్రామీణ తాగునీటి పథకం

మోటార్లు తరచూ మరమ్మతుల బారిన పడతుండటంతో నీటి సరఫరా నిలిచిపోతోంది. ఈ ఏడాదిలో జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే నాలుగు సార్లు పైపులైను లీకులు, మోటార్లు పాడవ్వడంతో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జాక్‌వెల్ (గోదావరి నీటిని తోడే ప్రాంతం) వద్ద ఏర్పాటు చేసిన మూడు మోటార్లకు గాను గతంలో నీటిని తోడే క్రమంలో ఒకటి పాడయింది. సెప్టెంబరు 20 తేదీన పిడుగులు పడి మిగిలిన రెండు కాలిపోయాయి. ఈ కారణంగా ఐదు రోజులపాటు తాగునీరు సరఫరా కాలేదు. తర్వాత రెండు కొత్త మోటార్లు బిగించగా ఇటీవల మళ్లీ ఒక మోటారు కాలిపోయింది. ప్రస్తుతం ఒకటి మాత్రమే నీరు సరఫరా చేస్తోంది. సరఫరాలో హెచ్చుతగ్గులు కారణంగా కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి ఏటా జిల్లా పరిషత్తు నుంచి వచ్చే రూ.50 లక్షలు సిబ్బంది జీతాలు, పైపులైన్ల లీకులకే సరిపోతోందని.. నిర్వహణ భారమవుతోందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు.

✦ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.. గతంలో సుమారు రూ.15 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపాం. నిధులు మంజూరు కాలేదు. మళ్లీ ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. తరుచూ మరమ్మతు బారిన పడటంతో బాగు చేయించడం ఇబ్బందిగా మారింది. ఈ పథకంపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. – ఎన్.అప్పారావు, డీఈ ఆర్‌డబ్ల్యూఎస్, కొవ్వూరు



అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ సత్యనారాయణ

పథకం పరిశీలన

తాళ్లపూడి, న్యూస్‌టుడే: ప్రజలకు శుద్ధిచేసిన గోదావరి తాగునీటి సరఫరా చేసే విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. తాళ్లపూడిలోని జాతీయ గ్రామీణ తాగునీటి పథకాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. గోదావరి నీటిని శుద్ధిచేసే ప్రదేశం, జాక్‌వెల్, నిల్వ చేసే ట్యాంకులు తదితర వాటిని పరిశీలించారు. పథకంలో పనిచేసే సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. జాక్‌వెల్‌లో వరద నీరు ఉండే ప్రదేశంలో మట్టి ఉంటే శుభ్రం చేయించాలన్నారు. కొత్త మోటార్లు కాలిపోతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఈ గిరి, డీఈ అప్పారావు, ఏఈ సూర్జాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై కరపత్రాల విడుదల

దేవరపల్లి: దుద్దుకూరులో ప్రగతిశీల కార్మిక సమైక్య ఆధ్వర్యంలో కార్మికుల సభ్యత్వ నమోదుపై బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కే మస్తాన్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులందరికీ సమగ్ర చట్టం చేయాలని, విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. పీకేఎస్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అధికారులకు సత్కారం

ఉండ్రాజవరం: పంచాయతీరాజ్ ఏఈ కె.భగవన్నారాయణ, గృహనిర్మాణసంస్థ ఏఈ విక్టర్ బాబులు బదిలీ కావటంతో వారికి వీడ్కోల సభను ఉండ్రాజవరంలో బుధవారం నిర్వహించారు. ఘనంగా సత్కరించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

చాగల్లు: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలతో ప్రజా సేవలకు శ్రీరామ్ మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. చాగల్లులో తెదేపా మండల అధ్యక్షుడు నాదెళ్ల శ్రీరామ్ జన్మదిన వేడుకలు అభిమానులు, నాయకులు, కార్యకర్తల మధ్య బుధవారం సందడిగా నిర్వహించారు. శ్రీరామ్ భారీ కేకును కోశారు. నాయకులు బీఎస్.నాగేంద్ర, కరుటూరి సతీష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



వెంకటాయపాలెంలో తూటికాడ కషాయం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

గోపాలపురం: తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే విధంగా నూతన సాంకేతిక పద్ధతులను రైతులు పాటించాలని ఆయా శాఖాధికారులు సూచించారు. మండలంలోని వెంకటాయపాలెం, చెరుకుమిల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మండల వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మార్కెటింగ్ శాఖాధికారులు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం వరి పంటకు సుడి దోమ, మెడ విరుపు తెగులుకు సేంద్రియ వ్యవసాయ సిబ్బంది తూటి కాడ కషాయం, మారేడు ఆకుల కషాయాలు తయారు చేసి వాటి ఉపయోగాలను వివరించారు. అధికారులు రాజారావు, రమేష్, దరీన్‌బాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాసరావు, దుర్గాదేవి, రైతులు పాల్గొన్నారు.



భవానీ మాలధారులకు పండ్లు, అల్పాహారాన్ని అందిస్తున్న ముస్లిం సోదరుడు సుభాని



పల్లంట్లలోని ఆలయంలో విద్యార్థులు



కోట సత్తెమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు



నిడదవోలు దత్త సాయి పీఠంలో..

సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి

తాళ్లపూడి, ఉండ్రాజవరం, పెరవలి, చాగల్లు, గోపాలపురం, దేవరపల్లి, నిడదవోలు, చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: దసరా మహోత్సవాలు పురస్కరించుకొని బుధవారం కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల్లో అమ్మవారు మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. రాజమహేంద్రవరానికి చెందిన ముస్లిం సోదరుడు సుభాని కొవ్వూరు గామన్ వంతెన సమీపంలో నడిచి వెళ్తున్న భవాని మాలదారులకు తాగునీరు, పండ్లను అందించారు. గత మూడేళ్లుగా తొమ్మిది రోజుల పాటు భవాని మాలదారులకు సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. దేవరపల్లిలోని బాలదుర్గమ్మ ఆలయంలో నిప్పుల గుండం, దుర్గమ్మ కథ ఏర్పాటు చేయగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో 800 మంది వరకు విద్యార్థులు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అమ్మవారిని దర్శించుకున్నారు.



పెద్దాపురంలో...



పసలపూడిలో...



పురుషోత్తపల్లిలో...



తాడిపర్రులో మహిళల బతుకమ్మ సంబరాలు

ఆదివాసీ హత్యాకాండను నిరసించాలి

నిడదవోలు: ఛత్తీస్‌గఢ్‌లో ఈనెల 4న జరిగిన ఆదివాసీ హత్యాకాండ రాజ్యాంగ వ్యతిరేకమని దీన్ని ప్రతిఒక్కరు నిరసించాలని పీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్ అన్నారు. బుధవారం నిడదవోలులో మాట్లాడారు. ఆదివాసీ హత్యలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో విచారణ జరిపించాలన్నారు. సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు ఈమని గ్రీష్మకుమార్, ఎంఆర్‌పీఎస్ నాయకుడు చెట్టే రామకృష్ణ పాల్గొన్నారు.

19 మద్యం దుకాణాలకు 689 దరఖాస్తులు

నిడదవోలు: నిడదవోలు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 19 మద్యం దుకాణాలకు ఇంతవరకు 689 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎక్సైజ్ నిడదవోలు సీఐ ఆర్‌జే సతీష్‌బాబు బుధవారం తెలిపారు. వాస్తవంగా ముందుగా ప్రకటించినట్లుగా ఈనెల 9వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుందని అన్నారు. అయితే ప్రభుత్వం ఈ గడువును ఈనెల 11వ తేదీ రాత్రి 7 గంటల వరకు పెంచిందన్నారు. రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో ఈనెల 14న లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు జరుగుతుందన్నారు.

క్రికెట్‌లో రాణిస్తున్న సాయి జ్యోత్స్న

జిల్లా జట్టు కెప్టెన్‌గా ఎంపిక



గెలుచుకున్న వివిధ ట్రోఫీలతో సాయి జ్యోత్స్న

నల్లజర్ల, న్యూస్‌టుడే: క్రికెట్‌పై ఆసక్తితో చిన్నతనం నుంచే సాధన చేస్తూ ఆల్‌రౌండర్‌గా రాణిస్తోంది దేవరపల్లి మండలం యాదవోలు గ్రామానికి చెందిన వెంకట సాయి జ్యోత్స్న. ప్రస్తుతం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న పోటీల్లో విజయం సాధించి జిల్లా జట్టులో చోటు సంపాదించింది. ఈ నెలఖారున కృష్ణాజిల్లా మచిలీపట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించబోతోంది. ఆటపై తనకున్న ఆసక్తి.. తన లక్ష్యాన్ని న్యూస్‌టుడేకు ఆమె వివరించారు.

ఆరో తరగతి నుంచే తర్ఫీదు..

యాదవోలు గ్రామంలోని జిల్లా ఉన్నత పాఠశాల్లో ఆరో తరగతి చదువుతున్నప్పటి నుంచే వ్యాయామోపాధ్యాయుడు మునీ సహకారంతో క్రికెట్‌లో తర్ఫీదు పొందుతున్నా. 2021లో అండర్-16 మహిళల విభాగంలో ఆంధ్రా క్రికెట్ జట్టు తరపున ఆడాను. 2022లో పల్లంటలో జరిగిన అండర్-17 మహిళల విభాగంలో 4 ఓవర్లలో 6 వికెట్లు తీసి 'ఉమెన్ ఆఫ్ ది మ్యాచ్' అందుకున్నాను. ఆ మ్యాచ్‌ను తిలకించడానికి వచ్చిన భారత జట్టు మాజీ వికెట్ కీపర్ ఎంఎస్‌కే ప్రసాద్ నన్ను అభినందించడం మరిచిపోలేను. అదే ఏడాది పల్లంట్లలో జిల్లా ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంపికలో జాతీయ జట్టుకు ఎంపికయ్యాను. ఈ పోటీలు నాగ్‌పూర్‌లో జరగాల్సి ఉన్నా వర్షాలు కారణంగా మ్యాచ్‌లు రద్దయ్యాయి. గత ఐదేళ్లలో జాతీయ జట్టులో పాల్గొంటూ విశాఖపట్టణం, గుంటూరు, మచిలీపట్టణాల్లో ఆడి ఇప్పటి వరకు 20కి పైగా మెమెంటోలు, ట్రోఫీలు, అభినందన ధ్రువ పత్రాలు అందుకున్నాను. ప్రసుతం మచిలీపట్టణంలో జరిగే పోటీలకు యాదవోలు పాఠశాల నుంచి ఐదుగురు, దుద్దుకూరు నుంచి ఇద్దరు, దేవరపల్లి నుంచి ఒకరు, పల్లంట నుంచి ఒకరు, పశ్చిమగోదావరిజిల్లా నుంచి ఇద్దరు.. ఇలా మొత్తం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి 15 మంది జిల్లా జట్టుకు ఎంపికయ్యాం. మిథాలీరాజ్, కోహ్లీ స్ఫూర్తితో క్రికెట్లో రాణిస్తున్నాను. భారత క్రికెట్ మహిళా జట్టుకు ఎంపికై దేశానికి పేరు తేవడమే నా లక్ష్యం.

మంత్రి నాదెండ్ల ఆకస్మిక తనిఖీలు



లారీ తనిఖీ చేస్తూ..



బియ్యం పరిశీలిస్తున్న మంత్రి

నల్లజర్ల, న్యూస్‌టుడే: జిల్లాలోని కాపవరంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్ తిరుగు ప్రయాణంలో నల్లజర్ల, దేవరపల్లి మండలాల్లో రెండు రైస్‌మిల్లులను తనిఖీ చేశారు. అక్కడ ఉన్న పెద్ద మొత్తంలో చౌక బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో దేవరపల్లి నుంచి తిరిగి వస్తూ ప్రయాణంలో అనంతపల్లి శివారులోని వీరవల్లి టోల్ ప్లాజా వద్ద లారీలను ఆపారు. అందులో బియ్యం అక్రమంగా తరలిస్తున్నారనే అనుమానంతో సంబంధిత అధికారులతో కలిసి తనిఖీ చేశారు. అనంతరం ప్రయాణం కొనసాగించారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి



బ్యాంకులో వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

నిడదవోలు: విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్ణయించుకుని ముందుకు సాగాలని ఒకేషనల్ రాష్ట్ర కోఆర్డినేటర్ భారతి అన్నారు. సమిశ్రగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శిక్షణా తరగతుల్లో భాగంగా బుధవారం వృత్తి విద్య తరగతులు నిర్వహించారు. దీనిలో భాగంగా సమిశ్రగూడెం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకును సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు వివిధ రకాల వృత్తులపై అవగాహన పెంచుకోవడం ద్వారా స్వయం ఉపాధి దిశగా రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

గ్రామాభివృద్ధికి పాలకవర్గాలు కృషి చేయాలి



సమిశ్రగూడెంలో మాట్లాడుతున్న ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి

నిడదవోలు, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల ఆస్తులను పరిరక్షించి గ్రామాభివృద్ధికి పాలకవర్గాలు కృషి చేయాలని నిడదవోలు ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. నిడదవోలు మండల పరిషత్ కార్యాలయం(సమిశ్రగూడెం)లో బుధవారం ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణా తరగతులను ఆమె ప్రారంభించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో కేవీ గణేష్, రిసోర్స్‌పర్సన్‌లు కుంచాల శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ మోహిద్దీన్, సీనియర్ అసిస్టెంట్ నాగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పరిపాలన...

పెరవలి: గ్రామాల్లో పంచాయతీ పాలక వర్గ సభ్యులు బాధ్యతలనెరిగి పనిచేయాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో చంద్రం వెంకటరమణ పేర్కొన్నారు. పెరవలి మండలపరిషత్‌లో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులకు రెండురోజులపాటు ఇచ్చిన శిక్షణ బుధవారంతో ముగిసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలక వర్గం తీసుకునే నిర్ణయాలతోనే పంచాయతీ పరిపాలన ఆధారపడి ఉంటుందన్నారు.

ఉండ్రాజవరం: ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని ఎంపీడీవో వి.రామారావు, ఈవోపీఆర్‌డీ కట్టమూరి ఆంజనేయశర్మ, శిక్షకుడు కోట రామప్రసాదు అన్నారు. మండలంలోని ఉపసర్పంచులు, పలువురు వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. పంచాయతీలకు వచ్చే నిధులు, రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణం, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా విషయాలపై అవగాహన కల్పించారు.

దశల వారీగా పెన్షనర్లకు బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ శ్రావ్య

నల్లజర్ల, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు దశల వారీగా పెన్షనర్లకు విడుదల చేయాలని విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం మండలశాఖ అధ్యక్షుడు ఐ.వి.సత్యం డిమాండ్ చేశారు. బుధవారం ఈ సంఘ సమావేశం నల్లజర్లలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్టేట్ బ్యాంక్ మేనేజర్ శ్రావ్య పాల్గొన్నారు. ప్రభుత్వ పెన్షనర్లు 76 ఏళ్ల వయస్సు వరకు రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. పెన్షనర్లకు బ్యాంక్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి నగదు లావాదేవీలు త్వరగా అయ్యేలా ఏర్పాటు చేస్తానన్నారు. ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, ఎస్.ఎం. ఆలీసాహెబ్, ప్రభుదాసు, ఏసురత్నం, అప్పారావు, బాలయ్య పాల్గొన్నారు.



వెలగదుర్రులో కలిసిన పూర్వ విద్యార్థులు



నల్లజర్లలో...

ఆత్మీయ సమ్మేళనం

ఉండ్రాజవరం, నల్లజర్ల: వెలగదుర్రు పాఠశాలలో 1991-1992లో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం సమావేశమయ్యారు. నల్లజర్లలోని ఎస్‌ఆర్‌కే, కేఏస్సార్ కళాశాలలో 2011 నుంచి 2013 సంవత్సరం వరకు ఇంటర్ చదువుకున్న విద్యార్థులంతా ఆ కళాశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రోజంతా సరదాగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులను సత్కరించారు. సహపంక్తి భోజనాలు చేశారు. పూర్వపు విద్యార్థులు కొత్తపల్లి పవన్‌కుమార్, చిన్ని ఆశీర్వాదం, సురేష్, సాయి, వాసు, సంధ్య పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నిడదవోలులో చేగువేరా వర్ధంతి

నిడదవోలు, న్యూస్‌టుడే: ప్రపంచ ప్రఖ్యాత విప్లవయోధుడు ఎర్నెస్ట్ చేగువేరా అందరికీ ఆదర్శప్రాయుడని సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు అన్నారు. చేగువేరా వర్ధంతి సందర్భంగా నిడదవోలులో బుధవారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.చిరంజీవి, సురేష్, రాజేష్, కృష్ణ, కొండ, భవాని, రాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పాత పాలసీ రద్దుపై ఆగ్రహం

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఎల్ఐసీ యాజమాన్యం చేపట్టిన నూతన విధానాలను నిరసిస్తూ బుధవారం ఆ సంస్థ ఏజెంట్లు కొవ్వూరులో నిరసన వ్యక్తం చేశారు. ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు పీఎన్.కిషోర్ మాట్లాడుతూ ఎల్ఐసీ యాజమాన్యం పాత పాలసీలను రద్దు చేసి, కొత్త పాలసీలను ప్రవేశపెట్టిందన్నారు. దీంతో ఏజెంట్లు బోనస్‌లను నష్టపోయే అవకాశం ఉందన్నారు. కొవ్వూరు, నిడదవోలు ఎల్ఐసీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు

నిమ్మ అధరహో

కిలో రూ. 40 నుంచి రూ. 60

గోపాలపురం, న్యూస్‌టుడే


దసరా పండగ రావడం, ఇతర రాష్ట్రాల నుంచి డిమాండ్ ఉండటంతో నిమ్మకాయల ధరలు పెరిగాయి. గత పది రోజుల కిందటి వరకు కిలో రూ.30 వరకు ఉన్న ధర ఇప్పుడు రూ.40 నుంచి రూ.60కి చేరింది. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. గత ఏడాది సైతం ఇదే రోజుల్లో కిలో రూ.100 వరకు పలికింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పండగల నేపథ్యంలో...

గత నెలలో వచ్చిన వరదల కారణంగా నిమ్మకాయలు సరిగా కాయకపోవడం, మరో పక్క తోటలు తీసివేయడంతో వీటికి డిమాండ్ పెరిగింది. గతంలో రూపాయికి వచ్చే కాయ ఇప్పుడు రూ.5కు దొరకడం కూడా కష్టంగా ఉంది. పండుగల నేపథ్యంలో ఎండలు విపరీతంగా కాయడంతో నిమ్మ ధరలు బాగా పెరిగాయి.

వెయ్యి ఎకరాల్లో సాగు..

గోపాలపురం నియోజకవర్గ పరిధిలోని గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల్లో వెయ్యి ఎకరాల్లో నిమ్మ సాగు ఉంది. గతంలో 13 నుంచి 15 వందల ఎకరాల్లో నిమ్మ సాగు చేసేవారు. దేవరపల్లి మండలం యాదవోలు నిమ్మకాయ మార్కెట్ నుంచి నిత్యం వందలాది బస్తాల నిమ్మకాయలు విజయవాడ, హైదరాబాద్, ముంబాయి, దిల్లీ, చెన్నై, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాలకు సరఫరా చేస్తుంటారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న నిమ్మకాయలు

ఆశాజనకంగా..

గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం నిమ్మ ధర కొంచెం తగ్గినా.. ఆశాజనకంగానే ఉంది. ప్రస్తుతం మార్కెట్‌కు కాయలు తక్కువ రావడంతో నాణ్యతను బట్టి అధిక ధర పలుకుతుంది. మా వద్ద తక్కువ ధరకు తీసుకున్న రోజువారీ వ్యాపారస్థులు అధిక ధరకు విక్రయిస్తున్నారు. - డి.శివ, నిమ్మకాయల వ్యాపారి, రాజమహేంద్రవరం